News Daily
ఎడిటర్ :
B. ఉపేందర్
cknews7484@gmail.com
Visit in : www.cknewstv.in

# CK NEWS
చంద్రకాంత్
తెలుగు దినపత్రిక

Website cknewstv.in

సంపుటి : 03 | సంచిక :138 | ఖమ్మం | గురువారం, జూలై 3, 2025 | CK NEWS | పేజీలు : 08

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Warangal, Mahabubnagar. Rangareddy, Medak, Adilabad

## మేడారం మహాజాతర తేదీలు ఖరారు



తెలంగాణ కుంభమేళాగా పేరొందిన మేడారం సమ్మక్క, సారలమ్మ మహాజాతర తేదీలు ఖరారయ్యాయి. రెండేళ్లకోసారి నాలుగు రోజుల పాటు జరిగే ఈ మహోత్సవం తేదీలను బుధవారం పూజారులు మేడారంలో ప్రకటించారు. మాఘశుద్ధ పౌర్ణమికి ముందు వచ్చే బుధవారం రోజున

వివరాలు 2లో..

## నియోజకవర్గానికి రెండు ఇంటిగ్రేటెడ్ పాఠశాలలు

- ఇంటర్ వరకు డ్రాపౌట్లు ఉండొద్దు
- 9-12 తరగతుల విధానంపై అధ్యయనం చేయండి
- 'ఇంటర్'పై అసెంబ్లీలోనూ చర్చిద్దాం
- విద్యాశాఖ సమీక్షలో సీఎం రేవంత్‌రెడి



రాష్ట్రంలోని ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో బాలురకు ఒకటి, బాలికలకు మరొకటి చొప్పున యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలను నెలకొల్పుతామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ఇప్పటికే తొలుత ప్రకటించిన పాఠశాలలకు సంబంధించిన స్థలాల సేకరణ పూర్తయినందున, ఇకపై రెండో విడత పాఠశాలలపై దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. విద్యాశాఖపై పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో బుధవారం అధికారులతో సమీక్షించారు. ఇప్పటివరకు నియోజకవర్గానికి ఒకటి చొప్పున హైదరాబాద్ జిల్లా మినహా మిగిలిన 105 నియోజకవర్గాల్లో ఒక్కో ఇంటిగ్రేటెడ్ పాఠశాలను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రభుత్వం చెబుతూ వచ్చింది. తాజాగా నియోజకవర్గానికి రెండు చొప్పున నిర్మిస్తామని సీఎం వెల్లడించడం గమనార్హం. సమీక్ష సందర్భంగా యంగ్ ఇండియా రెసిడెన్షియల్ పాఠశాలల భవనాల నమూనాలను, వీరనారి చాకలి ఐలమ్మ మహిళా వర్సిటీ భవనం నమూనాను ఆయన పరిశీలించి కొన్ని మార్పులను సూచించారు. అనంతరం సీఎం మాట్లాడుతూ... "ప్రతి యంగ్ ఇండియా పాఠశాలలో భారీ జాతీయ జెండా ఏర్పాటు చేయాలి. పాఠశాలల నిర్మాణ ప్రక్రియను వేగవంతం చేయాలి. నిర్మాణాల పురోగతిపై ప్రతి వారం నాకు నివేదిక సమర్పించాలి. సాధ్యమైనంత త్వరగా టెండర్ల ప్రక్రియను



వివరాలు 2లో..

## చంద్రబాబు, రేవంత్ మధ్య చీకటి ఒప్పందం ఉంది

- చంద్రబాబుకు రేవంత్ బ్యాగ్ మ్యాన్ గా మారారన్న హరీశ్
- తెలంగాణ ప్రయోజనాలకు విరుద్ధంగా బనకచర్లకు మద్దతిస్తున్నారని విమర్శ
- రేవంత్ కు బేసిన్ల గురించి తెలియదని ఎద్దేవా




ఏపీ సీఎం చంద్రబాబు కోసం తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 'బ్యాగ్ మ్యాన్'గా మారి రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టు పెడుతున్నారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్రస్థాయిలో విమర్శించారు. బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ రాష్ట్ర హక్కులు, ప్రజల సంక్షేమం కోసమే పనిచేస్తుంటే, రేవంత్ రెడ్డి మాత్రం కేవలం తన రాజకీయాలకే ప్రాధాన్యత ఇస్తున్నారని ఆయన ఆరోపించారు. ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం ప్రగతి భవన్‌లో నీటిపారుదల శాఖపై ఇచ్చిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌పై హరీశ్ రావు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆ ప్రజెంటేషన్ చూస్తే హైదరాబాద్‌లో కాకుండా అమరావతిలో ఇచ్చినట్లుందని, దాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వమే తయారు చేసిందనే అనుమానం కలుగుతోందని ఆయన ఎద్దేవా చేశారు. బనకచర్ల ప్రాజెక్టును ఏపీ సీఎం ఎలా ముందుకు తీసుకెళ్తున్నారో, ఎలాంటి వ్యాఖ్యలు చేశారో ఆ ప్రజెంటేషన్‌లో ఉద్దేశపూర్వకంగానే చూపించలేదని ఆరోపించారు. "బనకచర్ల కట్టే చంద్రబాబు రేవంత్‌కు దేవుడిలా కనిపిస్తున్నారు. అదే బనకచర్లను ఆపాలని

వివరాలు 2లో..

## గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుల సమ్మేళనాన్ని విజయవంతం చేయాలి



ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆధ్వర్యంలో ఈ నెల 4న ఎల్బీ స్టేడియంలో జరిగే గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుల సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ సమ్మేళనానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ రాష్ట్ర ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్, ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, డీసీసీ అధ్యక్షులు, కార్పొరేషన్ల ఛైర్మన్లు,

వివరాలు 2లో..

## ప్రధాని మోదీకి ఘనా అత్యున్నత పురస్కారం



- ఆఫీసర్ ఆఫ్ ది ఆర్డర్ ఆఫ్ ది స్టార్ ఆఫ్ ఘనా' అవార్డు ప్రదానం
- ఘనా అధ్యక్షుడు జాన్ ద్రమాని మహామ చేతుల మీదుగా సత్కారం
- పురస్కారాన్ని 140 కోట్ల భారతీయులకు అంకితమిచ్చిన ప్రధాని
- మూడు దశాబ్దాల తర్వాత ఘనాలో పర్యటిస్తున్న భారత ప్రధాని
- ఇరు దేశాల సంబంధాలు సమగ్ర భాగస్వామ్య స్థాయికి పెంపు

వివరాలు 2లో..

## మంగళగిరిలో మంత్రి లోకేశ్ కు ఆత్మీయ స్వాగతం పలికిన ప్రజలు

- మంగళగిరిలో మంత్రి నారా లోకేశ్ కొత్త కార్యక్రమం
- 'సుపరిపాలనలో తొలి అడుగు' పేరుతో శ్రీకారం
- ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వ విజయాల ప్రచారం
- సీతానగరంలో రిటైనింగ్ వాల్ పనుల పరిశీలన
- రూ.295 కోట్ల అంచనాతో ప్రాజెక్టు నిర్మాణం
- వరద ముంపు నుంచి శాశ్వత పరిష్కారమని వెల్లడి



రాష్ట్ర ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్ బుధవారం తన నియోజకవర్గమైన మంగళగిరిలో పర్యటించారు. తాడేపల్లి పట్టణంలో 'సుపరిపా లనలో తొలి అడుగు' అనే పేరుతో

వివరాలు 2లో..

## ఏపీ కేడర్ ఐపీఎస్ అధికారి సిద్ధార్థ్ కౌశల్ రాజీనామా!

- సర్వీస్ ఉండగానే ఐపీఎస్‌కు గుడ్ బై చెప్పిన సిద్ధార్థ్ కౌశల్
- డీజీపీకి రాజీనామా లేఖ పంపిన ఐపీఎస్ అధికారి
- వ్యక్తిగత కారణాల వల్లే రాజీనామా చేశానని వెల్లడి

వివరాలు 2లో..




## ఆగని మృత్యుఘోష

- సిగాచీ ఘటనలో 38కి చేరిన మరణాలు
- సిగాచీ పరిశ్రమ వద్ద బాధితుల రోదన



సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం పాశమైలారంలోని సిగాచీ పరిశ్రమలో జరిగిన దుర్ఘటనలో మృతుల సంఖ్య పెరుగుతోంది. మంగళవారం నాటికి 36 మంది మృతి చెందినట్లు అధికారులు ప్రకటించిన విషయం తెలిసిందే. సహాయక సిబ్బంది బుధవారం శిథిలాల కింద మరో రెండు మృతదేహాలను వెలికితీశారు. దీంతో మృతుల సంఖ్య 38కి చేరింది. గాయపడిన 35 మంది హైదరాబాద్ శివార్లలోని వేర్వేరు ఆసుపత్రుల్లో

వివరాలు 2లో..

## హైదరాబాద్ మెట్రో విస్తరణపై రాజకీయాలు.. కేంద్రంపై విజయశాంతి ఫైర్

- హైదరాబాద్ మెట్రో రెండో దశపై కేంద్రం నిర్లక్ష్యం
- కాంగ్రెస్‌కు మంచి పేరు వస్తుందనే జాప్యం చేస్తున్నారని ఆరోపణ
- 'ఎక్స్' వేదికగా కేంద్రంపై విమర్శలు గుప్పించిన విజయశాంతి
- సీఎం రేవంత్ వినతులను పట్టించుకోవడం లేదని ఆవేదన
- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ప్రత్యేక బాధ్యత తీసుకోవాలని సూచన

హైదరాబాద్ మెట్రో రైలు రెండో దశ విస్తరణ విషయంలో కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిపై కాంగ్రెస్ ఎమ్మెల్సీ, సినీనటి విజయశాంతి తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందనే రాజకీయ కారణాలతోనే కేంద్రం ఈ ప్రాజెక్టుకు ఆమోదం తెలపకుండా ఉద్దేశపూర్వకంగా జాప్యం చేస్తోందని ఆమె ఆరోపించారు. ఈ మేరకు సోషల్ మీడియా

వివరాలు 2లో..



## ఏపీ లిక్కర్ స్కాం.. వాళ్లిద్దరికీ కోర్టులో చుక్కెదురు




- లిక్కర్ స్కామ్ నిందితులు ధనుంజయరెడ్డి, కృష్ణమోహన్ రెడ్డిల బెయిల్ పిటిషన్‌లను డిస్మిస్ చేసిన ఏసీబీ కోర్టు
- వీరి బెయిల్ పిటిషన్లపై ఇటీవల ఏసీబీ కోర్టులో ముగిసిన విచారణ
- తీర్పు రిజర్వు చేసిన న్యాయస్థానం

వివరాలు 2లో..

## బనకచర్లపై చర్చకు ఎక్కడైనా సిద్ధం

- గాంధీభవన్‌లో వినతుల స్వీకరణ వినతులు
- స్వీకరిస్తున్న మంత్రి శ్రీహరి

వివరాలు 2లో..



బనకచర్ల ప్రాజెక్టుపై చర్చకు ఎక్కడైనా సిద్ధమని రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు. బనకచర్ల విషయంలో తప్పంతా కాంగ్రెస్ ప్రభుత్వానిదే అన్నట్లు భారాస నేత హరీశ్‌రావు చేస్తున్న విమర్శలను ఆయన ఖండించారు. బుధవారం గాంధీభవన్‌లో నిర్వహించిన 'మంత్రులతో ముఖాముఖి'లో మంత్రి పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వివిధ సమస్యలకు సంబంధించి 90 అర్జీలు వచ్చాయి

# నియోజకవర్గానికి రెండు ఇంటిగ్రేటెడ్ పాఠశాలలు

- **మొదటి పేజీ తరువాయి**

పూర్తి చేయాలి.

**ఇంటర్‌లో ఉత్తీర్ణత ఎందుకు తగ్గుతోంది?**

పదో తరగతిలో పెద్ద సంఖ్యలో ఉత్తీర్ణులవుతున్నా... ఇంటర్ పూర్తయ్యేసరికి ఆ సంఖ్య గణనీయంగా తగ్గిపోతోంది. కారణాలు, సమస్యలను గుర్తించి పరిష్కారానికి కృషి చేయాలి. ప్రతి విద్యార్థి జీవితంలో ఇంటర్ దశ కీలకమైంది. ఆ సమయంలో వారికి సరైన మార్గదర్శకత్వం లభించాల్సిన అవసరముంది. పదో తరగతిలో ఉత్తీర్ణులైన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఇంటర్ పూర్తి చేసేలా చూడాలి. చేరికలతోపాటు వారి హాజరుపైనా దృష్టి సారించాలి.

ఇంటర్ విద్య మెరుగుకు అన్ని దశల్లో చర్చించి శాసనసభలోనూ చర్చకు పెడదాం” అని సూచించారు. ఇతర రాష్ట్రాల్లోని పాఠశాలల్లో 12వ తరగతి వరకు విద్య అందుతోందని, అందుకే అక్కడ డ్రాపౌట్లు తక్కువని అధికారులు సీఎంకు తెలియజేశారు. ఈ క్రమంలో 12వ తరగతి వరకు పాఠశాలలున్న రాష్ట్రాలు, ఇంటర్‌మీడియట్ వేరుగా ఉన్న రాష్ట్రాల్లో అధ్యయనం చేసి, నివేదిక సమర్పించాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. సమావేశంలో సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు కేశవరావు, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్‌రెడ్డి, విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా, ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ఆచార్య బాలకిష్టారెడ్డి, సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన, ఇంటర్‌బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్య, జేఎన్‌టీయూహెచ్ రిజిస్ట్రార్ ఆచార్య కె.వెంకటేశ్వరరావు, తెలంగాణ విద్యా సంక్షేమ మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ ఎండీ గణపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# చంద్రబాబు, రేవంత్ మధ్య చీకటి ఒప్పందం ఉంది

- **మొదటి పేజీ తరువాయి**

పోరాడుతున్న బీఆర్‌ఎస్ మాత్రం చచ్చిన పాములా కనిపిస్తోంది” అని హరీశ్ రావు అన్నారు.

బీఆర్‌ఎస్‌ను చచ్చిన పాముతో పోల్చడంపై హరీశ్ రావు ఘాటుగా స్పందించారు. బీఆర్‌ఎస్ నిజంగానే చచ్చిన పాము అయితే, కాంగ్రెస్ నేతలు నిద్రలో కూడా దాని గురించే ఎందుకు కలవరిస్తున్నారని ప్రశ్నించారు. పదకొండేళ్లుగా కేంద్రంలో అధికారంలో లేని కాంగ్రెస్ పార్టీ కూడా చచ్చిన పామేనా? అని ఆయన నిలదీశారు. టెక్నికల్‌గా రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ముఖ్యమంత్రి అయినా, ఆయన మనసంతా ఏపీ వైపే ఉందనే విషయం రాష్ట్ర ప్రజలకు స్పష్టంగా అర్థమవుతోందని అన్నారు.

బనకచర్ల విషయంలో రేవంత్ రెడ్డి, చంద్రబాబు మధ్య తెరవెనుక ఒప్పందాలు జరిగాయని హరీశ్ రావు ఆరోపించారు. 2024లో ప్రజాభవన్ వేదికగా రేవంత్ రెడ్డి, బెజవాడ వేదికగా ఉత్తమ్ కుమార్ రెడ్డి గోదావరి-బనకచర్ల ప్రాజెక్టుకు పచ్చజెండా ఊపారని అన్నారు. దీనికి కొనసాగింపుగా, 2024 నవంబర్ 15న, ఆ తర్వాత డిసెంబర్‌లోనూ ఏపీ సీఎం చంద్రబాబు బనకచర్ల ప్రాజెక్టుకు నిధులు కేటాయించాలని కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్‌కు లేఖలు రాశారని, ఈ లేఖలన్నీ బయటకు వచ్చినా రేవంత్ రెడ్డి మౌనంగా ఉన్నారని దుయ్యబట్టారు. ఈ కుట్రను తాను ఈ ఏడాది జనవరి 24న ప్రెస్ మీట్‌లో బయటపెట్టానని, ఆ తర్వాతే తెలంగాణ ప్రభుత్వం తరఫున మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అంతకు ముందు తేదీ వేసి కేంద్రానికి లేఖ రాశారని హరీశ్ రావు ఆరోపించారు. బీఆర్‌ఎస్ చేసిన పోరాటం వల్లే బనకచర్ల

ప్రాజెక్టుకు సంబంధించిన టర్మ్స్ ఆఫ్ రిఫరెన్స్ (టీఓఆర్) ప్రక్రియ తాత్కాలికంగా ఆగిందని, ఇది తమ పోరాట ఫలితమేనని స్పష్టం చేశారు. అపెక్స్ కమిటీ సమావేశంలో బనకచర్ల అంశం చర్చకు రాలేదని, కేవలం సముద్రంలోకి వృథాగా పోతున్న 3 వేల టీఎంసీల నీటిపై ఇరు రాష్ట్రాలు కూర్చుని మాట్లాడుకోవాలని మాత్రమే నిర్ణయించారని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డికి నదీ బేసిన్లపై కనీస అవగాహన లేదని, అహంకారంతో మాట్లాడితే ప్రజలు అధఃపాతాళానికి తొక్కడం ఖాయమని హెచ్చరించారు.

# మేడారం మహాజాతర తేదీలు ఖరారు

- **మొదటి పేజీ తరువాయి**

ఈ ఉత్సవం ప్రారంభమవుతుంది. ఎప్పుడూ ఫిబ్రవరి నెలలో వచ్చే ఈ జాతర ఈసారి పక్షం రోజుల ముందుగానే వచ్చింది. 2026 జనవరి 28వ తేదీ బుధవారం సారలమ్మ రాకతో జాతర ప్రారంభమవుతుంది. 29న గురువారం సమ్మక్క దేవత గద్దెకు రావడం, 30న శుక్రవారం భక్తులు మొక్కులు సమర్పించుకోవడం, 31వ తేదీ దేవతల వనప్రవేశంతో జాతర ముగియనుంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించి పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేయాలని పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్దబోయిన జగ్గారావు ఈ సందర్భంగా కోరారు.

# ప్రధాని మోదీకి ఘనా అత్యున్నత పురస్కారం

భారత ప్రధాని నరేంద్ర మోదీ తన విదేశీ పర్యటనలో అరుదైన గౌరవాన్ని అందుకున్నారు. ఆయన విశిష్ట రాజనీతిజ్ఞతకు, ప్రపంచవ్యాప్తంగా ప్రభావవంతమైన నాయకత్వానికి గుర్తింపుగా పశ్చిమ ఆఫ్రికా దేశమైన ఘనా తమ దేశ అత్యున్నత జాతీయ పురస్కారం ‘ఆఫీసర్ ఆఫ్ ది ఆర్డర్ ఆఫ్ ది స్టార్ ఆఫ్ ఘనా’తో సత్కరించింది. బుధవారం ఘనా రాజధాని అక్రలో జరిగిన కార్యక్రమంలో ఆ దేశ అధ్యక్షుడు జాన్ ద్రమాని మహామ స్వయంగా ఈ అవార్డును ప్రధాని మోదీకి అందజేశారు. ఈ గౌరవం పట్ల ప్రధాని మోదీ హర్షం వ్యక్తం చేశారు. ఈ పురస్కారాన్ని తాను 140 కోట్ల మంది భారతీయుల తరఫున స్వీకరిస్తున్నానని తెలిపారు. భారత యువత ఆకాంక్షలకు, దేశ సాంస్కృతిక వైవిధ్యానికి, అలాగే భారత్-ఘనా మధ్య ఉన్న చారిత్రక బంధానికి ఈ పురస్కారాన్ని అంకితం చేస్తున్నట్లు ఆయన ప్రకటించారు. ఈ ప్రత్యేక గౌరవం అందించినందుకు ఘనా ప్రభుత్వానికి, ప్రజలకు ప్రధాని కృతజ్ఞతలు తెలియజేశారు. “ఘనా అత్యున్నత పురస్కారం అందుకోవడం గౌరవంగా ఉంది. ఇది భారత్-ఘనా మధ్య ఉన్న బలమైన, చిరకాల సంబంధాలకు నిదర్శనం” అని ప్రధాని మోదీ ‘ఎక్స్’ వేదికగా పేర్కొన్నారు.

ప్రధాని మోదీకి ఈ పురస్కారం లభించడంపై భారత విదేశాంగ శాఖ కూడా స్పందించింది. గ్లోబల్ సౌత్ దేశాల వాణిని బలోపేతం చేయడానికి మోదీ చేస్తున్న నిరంతర కృషికి లభించిన గుర్తింపు ఇదని విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ అన్నారు. ఘనాతో మన స్నేహానికి, సహకారానికి ఇది నిదర్శనమని ఆయన ‘ఎక్స్’ లో పోస్ట్ చేశారు. ఈ పురస్కారం ఇరు దేశాల మధ్య స్నేహాన్ని మరింత బలోపేతం చేస్తుందని, ద్వైపాక్షిక సంబంధాలను ముందుకు తీసుకెళ్లేందుకు తనపై కొత్త బాధ్యతను పెంచిందని ప్రధాని మోదీ పేర్కొన్నట్లు విదేశాంగ శాఖ ఒక అధికారిక ప్రకటనలో తెలిపింది.

ఐదు దేశాల పర్యటనలో భాగంగా ప్రధాని మోదీ మొదటగా ఘనా చేరుకున్నారు. గత మూడు దశాబ్దాల కాలంలో ఒక భారత ప్రధాని ఘనాలో పర్యటించడం ఇదే తొలిసారి కావడం విశేషం. ఈ పర్యటన సందర్భంగా ప్రధాని మోదీ, ఘనా అధ్యక్షుడు మహామ మధ్య విస్తృత స్థాయి చర్చలు జరిగాయి. అనంతరం ఇరు దేశాలు తమ సంబంధాలను ‘సమగ్ర భాగస్వామ్య’ స్థాయికి పెంచుకుంటున్నట్లు ప్రకటించాయి. తన చారిత్రక పర్యటన భారత్-ఘనా సంబంధాలకు కొత్త ఊపునిస్తుందని ప్రధాని మోదీ విశ్వాసం వ్యక్తం చేశారు.

# ఆగని మృత్యుఘోష

- **మొదటి పేజీ తరువాయి**

చికిత్స పొందుతున్నారు. మియాపూర్‌లోని ప్రైవేటు ఆసుపత్రి నుంచి 8 మంది డిశ్చార్జి అయ్యారు. మిగతా 60 మంది కార్మికుల ఆచూకీ లభించిందని, మరో 10 మంది ఏమయ్యారో తెలియడం లేదని అధికారులు వెల్లడించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తంచేసిన నేపథ్యంలో పరిశ్రమ యాజమాన్యం స్పందించింది. మృతుల కుటుంబాలకు రూ.కోటి పరిహారం అందిస్తామని, బీమాపరంగా లభించే అన్ని రకాల సౌకర్యాలను వర్తింపజేస్తామని ప్రకటించింది. ఘటన కారణంగా మూడు నెలలపాటు కంపెనీని మూసి వేస్తామని, ప్రమాదానికి కారణాలపై చేపట్టిన విచారణకు సహకరిస్తామంది.

**డీఎన్‌ఏ పరీక్షలతోనే మృతదేహాల గుర్తింపు**

కార్మికుల మృతదేహాలు గుర్తుపట్టలేని విధంగా కాలిపోయాయి. ఇప్పటివరకు 38 మృతదేహాలను వెలికితీయగా... 23 మందిని గుర్తించారు. 18 మృతదేహాలను వారి బంధువులకు అప్పగించి, స్వస్థలాలకు పంపించారు. మిగిలిన వారిని గుర్తించేందుకు డీఎన్‌ఏ పరీక్షలు చేపట్టారు. రెండు మృతదేహాలకు సంబంధించిన వారెవరూ తమను సంప్రదించలేదని అధికారులు చెబుతున్నారు. తమ ఆసుపత్రిలో చేరిన 22 మందిలో ఎనిమిది మందిని డిశ్చార్జి చేసినట్లు మియాపూర్‌లోని ప్రణవ్ ఆసుపత్రి నిర్వాహకులు బుధవారం ప్రకటించారు.

**యంత్రాలను మార్చాలన్నా... వినలేదని ఫిర్యాదు**

కర్మాగారంలో పాత యంత్రాలున్నాయని, వాటి స్థానంలో కొత్తవి బిగించాలని విన్నవించినా... వినకపోవడంతోనే ప్రమాదం జరిగినట్లు కార్మిక కుటుంబాల సభ్యులు ఆరోపిస్తున్నారు.

**సహాయక చర్యలపై సమీక్ష**

సహాయక చర్యలను వేగవంతం చేయాలని సంగారెడ్డి కలెక్టర్ ప్రావీణ్య, ఎస్పీ పరితోష్ పంకజ్‌లను మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశించారు. శిథిలాలను తరలించేందుకు సమీపంలోనే మూడు ఎకరాల స్థలాన్ని పరిశీలించారు. మరోవైపు ఘటన జరిగి మూడు రోజులు గడిచినా... గల్లంతైన వారి గురించి సమాచారం అందించకపోవడంపై మంత్రిని బాధిత కుటుంబాల సభ్యులు కొందరు నిలదీశారు.

సాంకేతికత వినియోగం

ఘటన జరిగినప్పుడు 143 మంది విధుల్లో ఉన్నట్లు కంపెనీ ప్రతినిధులు తెలిపారు. కార్మిక సంఘాల నాయకులు, బాధితులు మాత్రం కాంట్రాక్టు ప్రాతిపదికన దినసరి వేతనంపై మరికొందరు సోమవారం విధులకు హాజరయ్యారని చెబుతున్నారు. మొత్తం ఎందరున్నారో గుర్తించేందుకు పోలీసులు సెల్‌ఫోన్ల సిగ్నల్స్‌ను పరిశీలిస్తున్నారు.

**పరిశ్రమను లీజుకిచ్చాం: సిగాచీ డైరెక్టర్ చిదంబరం**

సిగాచీ పరిశ్రమను వేరే వారికి లీజుకి ఇచ్చామని పరిశ్రమ డైరెక్టర్ చిదంబరం వెల్లడించారు. ప్రమాదంలో మృతి చెందిన పరిశ్రమ వైస్ ప్రెసిడెంట్ ఇలంగోవన్ మృతదేహాన్ని తీసుకెళ్లేందుకు బుధవారం ఆయన పటాన్‌చెరు ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... పరిశ్రమలో కాంట్రాక్టు కార్మికులు లేరని, అంతా పర్మినెంట్ వాళ్లేనన్నారు. అదే సమయంలో బాధిత కుటుంబ సభ్యులు, కార్మిక సంఘాల నాయకులు అక్కడికి వచ్చారు. తమ వారి ఆచూకీ చెప్పాలని నిలదీశారు.

**సీసీ కెమెరా ఏం చెబుతుందో..?**

సిగాచీ పరిశ్రమలో భారీ పేలుడు సంభవించి మూడు రోజులు గడిచినా...అప్పుడేం జరిగింది... ఎందరు చనిపోయారనే దానిపై స్పష్టత లేదు. ఈ నేపథ్యంలో పరిశ్రమ వద్ద మూడంతస్తుల ఎత్తులో ఏర్పాటు చేసిన సీసీ కెమెరా ప్రస్తుతం కీలకం కానుంది. ఇది పరిశ్రమలోకి రాకపోకలు సాగించే వారిని రికార్డు చేస్తుంది. సంబంధిత ఫుటేజీని పోలీసులు బుధవారం స్వాధీనం చేసుకున్నారు.

# మంగళగిరిలో మంత్రి లోకేశ్ కు ఆత్మీయ స్వాగతం పలికిన ప్రజలు

- **మొదటి పేజీ తరువాయి**

ఒక నూతన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు, నాయకులు మంత్రికి ఆత్మీయ స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో భాగంగా, లోకేశ్ తాడేపల్లిలోని పలు ప్రాంతాల్లో ఇంటింటికీ తిరిగారు. స్థానిక ప్రజలను నేరుగా కలుసుకుని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వారికి వివరించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుంటూ ముందుకు సాగారు.

అనంతరం, తన పర్యటనలో భాగంగా తాడేపల్లి మండలం సీతానగరం వద్ద కృష్ణా నది కరకట్ట వెంబడి నిర్మించ తలపెట్టిన రిటైనింగ్ వాల్ పనులను మంత్రి లోకేశ్ పరిశీలించారు. సుమారు రూ.295 కోట్ల అంచనా వ్యయంతో ఈ కీలకమైన ప్రాజెక్టును చేపడుతున్నట్లు అధికారులు ఆయనకు తెలిపారు.

ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ, ఈ రిటైనింగ్ వాల్ నిర్మాణం సీతానగరం, పరిసర ప్రాంతాల ప్రజల చిరకాల స్వప్నమని అన్నారు. ప్రతి ఏటా వరదల సమయంలో కృష్ణా నదికి భారీగా నీరు వచ్చినప్పుడు లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్లు ముంపునకు గురవుతున్నాయని, ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకే ఈ వాల్ నిర్మిస్తున్నామని ఆయన స్పష్టం చేశారు. ఈ నిర్మాణంతో స్థానికులకు వరద ముప్పు పూర్తిగా తప్పుతుందని లోకేశ్ భరోసా ఇచ్చారు. దీనిపై ఆయన సోషల్ మీడియాలోనూ స్పందించారు. “కూటమి ప్రభుత్వ ఏడాది పాలనను పురస్కరించుకుని మంగళగిరి నియోజకవర్గం తాడేపల్లిలోని మహానాడు కాలనీలో నిర్వహించిన సుపరిపాలనలో-తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొన్నాను. ఇంటింటికీ తిరిగి కరపత్రాల ద్వారా కూటమి ప్రభుత్వం ఏడాది కాలంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించాను. ప్రభుత్వ పథకాలు అందుతున్న తీరుపై ఆరా తీశాను. ఈ సందర్భంగా తాము ఎదుర్కొంటున్న పలు సమస్యలను స్థానికులు నా దృష్టికి తీసుకువచ్చారు. ఆయా సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామని హామీ ఇచ్చాను” అని వివరించారు.

# ఏపీ కేడర్ ఐపీఎస్ అధికారి సిద్ధార్థ్ కౌశల్ రాజీనామా!

ఆంధ్రప్రదేశ్ కేడర్‌కు చెందిన సీనియర్ ఐపీఎస్ అధికారి సిద్ధార్థ్ కౌశల్ తన సర్వీసుకు స్వచ్ఛందంగా రాజీనామా చేశారు. రెండు దశాబ్దాలకు పైగా పోలీస్ శాఖలో అందించిన సేవలకు ఆయన ముగింపు పలికారు. ఇది పూర్తిగా తన వ్యక్తిగత నిర్ణయమని, ఎలాంటి ఒత్తిళ్లు లేవని ఆయన స్పష్టం చేశారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. చాలాకాలంగా ఆలోచించిన తర్వాతే ఈ నిర్ణయం తీసుకున్నానని సిద్ధార్థ్ కౌశల్ తన ప్రకటనలో తెలిపారు. తన భవిష్యత్ జీవిత లక్ష్యాలకు, కుటుంబ సభ్యుల ఆకాంక్షలకు అనుగుణంగానే సర్వీసు నుంచి వైదొలగుతున్నట్లు వివరించారు. కొన్ని మీడియా మాధ్యమాల్లో వస్తున్నట్లుగా వేధింపులు లేదా బాహ్య ఒత్తిళ్ల కారణంగా తాను రాజీనామా చేశానన్న ప్రచారాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. “ఈ వార్తలు పూర్తిగా నిరాధారమైనవి, తప్పుదారి పట్టించేవి. నా నిర్ణయం పూర్తిగా స్వతంత్రమైనది, వ్యక్తిగతమైనది, స్వచ్ఛందమైనది” అని ఆయన స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో పనిచేయడం ఒక గౌరవంగా భావిస్తున్నానని కౌశల్ పేర్కొన్నారు. “ఐపీఎస్ అధికారిగా పనిచేయడం నా జీవితంలో అత్యంత సంతృప్తినిచ్చిన, విలువైన ప్రయాణం. నేను ఈ రాష్ట్రాన్ని ఎప్పుడూ నా సొంతిల్లుగానే భావించాను. ఇక్కడి ప్రజలు ఎప్పటికీ నా హృదయంలో ప్రత్యేక స్థానంలో ఉంటారు” అని ఆయన అన్నారు. తన వృత్తి జీవితంలో తనకు సహకరించిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి, సీనియర్ అధికారులకు, సహోద్యోగులకు, సిబ్బందికి, రాష్ట్ర ప్రజలకు ఆయన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. “మీ మద్దతు, విశ్వాసమే నన్ను ఒక అధికారిగా, వ్యక్తిగా తీర్చిదిద్దాయి” అని ఆయన పేర్కొన్నారు. భవిష్యత్తులోనూ కొత్త మార్గాల్లో సమాజానికి సేవ చేస్తానని సిద్ధార్థ్ కౌశల్ ఆశాభావం వ్యక్తం చేశారు. 2012 బ్యాచ్ ఐపీఎస్ అధికారి అయిన సిద్ధార్థ్ కౌశల్, గతంలో కృష్ణా, ప్రకాశం, వైస్సార్ కడప జిల్లాల ఎస్పీగా, రాష్ట్ర లా అండ్ ఆర్డర్ ఐజీగా బాధ్యతలు నిర్వర్తించారు. ఆయన తన అధికారిక ప్రకటనలో భవిష్యత్ ప్రణాళికల గురించి ఏమీ ప్రస్తావించనప్పటికీ, ఢిల్లీ కేంద్రంగా ఒక కార్పొరేట్ సంస్థలో చేరవచ్చని ఊహాగానాలు వినిపిస్తున్నాయి. అయితే ఈ వార్తలపై ఎలాంటి అధికారిక సమాచారం లేదు.

# ఏపీ లిక్కర్ స్కాం.. వాళ్లిద్దరికీ కోర్టులో చుక్కెదురు

వైసీపీ ప్రభుత్వ హయాంలో చోటుచేసుకున్న లిక్కర్ స్కామ్ కేసులో నిందితులకు ఏసీబీ కోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. సీఎంఓ మాజీ కార్యదర్శి కె. ధనుంజయరెడ్డి, జగన్ ఓఎస్డీ కృష్ణమోహన్ రెడ్డి దాఖలు చేసిన బెయిల్ పిటిషన్లను ఏసీబీ కోర్టు కొట్టివేసింది. ఈ ఇద్దరు నిందితులు దాఖలు చేసిన బెయిల్ పిటిషన్లపై విచారణ జరిపిన న్యాయస్థానం తీర్పును రిజర్వ్ చేసింది. తాజాగా ఆ పిటిషన్లను కొట్టివేస్తూ తీర్పు వెలువరించింది. ఏపీ లిక్కర్ స్కామ్ కేసులో ధనుంజయ రెడ్డి, కృష్ణమోహన్ రెడ్డి కీలక పాత్ర పోషించారని ప్రభుత్వం తరపు న్యాయవాది వాదనలు వినిపించారు. ఈ నేపథ్యంలో నిందితుల బెయిల్ పిటిషన్లను కొట్టివేస్తూ న్యాయస్థానం తీర్పును వెలువరించింది. కాగా, ఇదే కేసులో నిందితులుగా ఉన్న చెవిరెడ్డి భాస్కరరెడ్డి పీఏలుగా పనిచేసిన బాలాజీ, నవీన్‌లను సిట్ అధికారులు న్యాయస్థానం ముందు హాజరుపరచగా, వారికి న్యాయస్థానం 15 రోజుల రిమాండ్ విధించింది. ఇద్దరినీ గుంటూరు జిల్లా జైలుకు తరలించాలని న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది. సిట్ అధికారులు రెండు రోజుల క్రితం ఇండోర్ వెళ్లి బాలాజీ, నవీన్‌లను అదుపులోకి తీసుకున్న విషయం తెలిసిందే.

చెవిరెడ్డి భాస్కరరెడ్డి పేరు లిక్కర్ స్కామ్ కేసులో వెలుగులోకి వచ్చిన నాటి నుంచి ఆయనకు పీఏలుగా పనిచేసిన బాలాజీ, నవీన్‌లు రాష్ట్రం విడిచి పరారయ్యారు. అరెస్టు నుంచి తప్పించుకునేందుకు వీరు సెల్ ఫోన్లు స్విచ్ ఆఫ్ చేసి ఇండోర్‌లో తలదాచుకున్నారు.

## హైదరాబాద్ మెట్రో విస్తరణపై రాజకీయాలు..

# కేంద్రంపై విజయశాంతి ఫైర్

- **మొదటి పేజీ తరువాయి**

ప్లాట్‌ఫామ్ ‘ఎక్స్’ (ట్విట్టర్) వేదికగా ఆమె తన అభిప్రాయాలను పంచుకున్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఈ విషయంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని విజయశాంతి గుర్తుచేశారు. ఆయన ఢిల్లీ వెళ్లిన ప్రతి సందర్భంలోనూ ప్రధాని నరేంద్ర మోదీతో పాటు సంబంధిత కేంద్ర మంత్రులను కలిసి మెట్రో రెండో దశ విస్తరణ ఆవశ్యకతను వివరిస్తున్నారని తెలిపారు. ఎన్నిసార్లు ప్రతిపాదనలు సమర్పించినా కేంద్రం నుంచి సానుకూల స్పందన రావడం లేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఇది హైదరాబాద్ అభివృద్ధిని అడ్డుకోవడమేనని ఆమె అన్నారు. ఈ విషయంలో గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని బీజేపీ నాయకులు తమ బాధ్యతను గుర్తించాలని విజయశాంతి హితవు పలికారు. జీహెచ్ఎంసీలో రెండో అతిపెద్ద పార్టీగా 42 మంది కార్పొరేటర్లు బీజేపీకి ఉన్నారని, వారు మెట్రో విస్తరణకు కేంద్రం నుంచి అనుమతులు సాధించేందుకు చొరవ తీసుకోవాలని కోరారు. తమను నమ్మి ఓటు వేసిన నగర ప్రజలకు న్యాయం చేయాలంటే బీజేపీ నేతలు ఈ ప్రాజెక్టు కోసం కృషి చేయాల్సిన అవసరం ఉందని ఆమె సూచించారు. ముఖ్యంగా గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని బీజేపీ ఎంపీలు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఈ అంశంపై ప్రత్యేక బాధ్యత వహించాలని విజయశాంతి డిమాండ్ చేశారు. వారంతా కలిసికట్టుగా కేంద్ర మంత్రులను ఒప్పించి, మెట్రో రెండో దశకు తక్షణమే ఆమోదం లభించేలా చూడాలన్నారు. ఈ కీలకమైన ప్రాజెక్టు విషయంలో బీజేపీ తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాల్సిన సమయం ఇదేనని ఆమె స్పష్టం చేశారు.

# బనకచర్లపై చర్చకు ఎక్కడైనా సిద్ధం

- **మొదటి పేజీ తరువాయి**

. అనంతరం మంత్రి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. “అప్పటి ఏపీ సీఎం జగన్‌తో కలిసి.. రాయలసీమను రతనాల సీమగా మారుస్తామని కేసీఆర్ చెప్పలేదా? కేసీఆర్, హరీశ్‌రావులు సంతకాలు చేయడం వల్లే ఏపీ ప్రభుత్వం బనకచర్లను తెరపైకి తెచ్చింది. వారి తప్పిదాన్ని కప్పిపుచ్చుకొనేందుకు, సెంటిమెంట్‌ను రెచ్చగొట్టేందుకు భారాస నేతలు కాంగ్రెస్ ప్రభుత్వంపై తప్పుడు ప్రచారం చేస్తున్నారు. తెలంగాణలో కుల గణన జరిగిన తర్వాత కూడా భాజపా బీసీల పట్ల నిర్లక్ష్య వైఖరి చూపిస్తోంది. రాష్ట్ర అధ్యక్ష పదవి విషయంలో బీసీల పట్ల ఆ పార్టీ వైఖరి మరోసారి తేటతెల్లమైంది. బీసీ రిజర్వేషన్లపై రైల్ రోకో చేస్తానంటున్న భారాస ఎమ్మెల్సీ కవిత... ముందుగా ఆ పార్టీ అధ్యక్ష పదవి లేదా కార్యనిర్వాహక అధ్యక్ష పదవైనా బీసీలకు వచ్చేలా చూస్తే బాగుంటుంది’ అని మంత్రి వాకిటి పేర్కొన్నారు.

# గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుల సమ్మేళనాన్ని విజయవంతం చేయాలి

- **మొదటి పేజీ తరువాయి**

పార్టీ ముఖ్య నేతలు తదితరులు హాజరవుతారని బుధవారం ఆయనొక ప్రకటనలో పేర్కొన్నారు. పార్టీ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపై ఖర్గే దిశానిర్దేశం చేస్తారన్నారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి 500 మందిని సమ్మేళనానికి తరలించేందుకు నాయకులు కృషి చేయాలని పొన్నం కోరారు.

**సమ్మేళనం కోసం కంట్రోల్ రూం: మహేశ్‌కుమార్‌గౌడ్**

ఎల్బీ స్టేడియంలో ఈ నెల 4న జరగనున్న ‘గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుల సమ్మేళనం’ కోసం పీసీసీ ఆఫీస్ బేరర్లతో గాంధీభవన్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు చేశారు. లోక్‌సభ నియోజకవర్గాల ఇన్‌ఛార్జులు, నిర్వాహకులు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులను సమన్వయం చేస్తూ సమ్మేళనాన్ని విజయవంతం చేయడానికి ఈ కంట్రోల్ రూం పని చేస్తుందని పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సమ్మేళనానికి సంబంధించి వివరాల కోసం పీసీసీ ఉపాధ్యక్షులు కైలాశ్ కుమార్(9494227444), సురేశ్‌కుమార్(9849013524), అఫ్సర్ యూసుఫ్ జాహి(9391158997), జగదీశ్వర్‌రావు(9000279999), ప్రధాన కార్యదర్శి అల్లం భాస్కర్(9885298353)లను సంప్రదించాలని సూచించారు.

## ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.

- అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దు
- అత్యవసరమైతే డయల్ 100 నకు ఫోన్ చేసి పోలీస్ వారి సేవలు పొందండి.
- ఎస్పీ రోహిత్ రాజు.




సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),జూలై 02,ఎడతెరిపి లేకుండా విస్తారంగా కురుస్తున్న వర్షాల వలన జిల్లాలోని నదులు, వాగులు, వంకలు, చెరువులు పొంగి ఉద్రుతంగా ప్రవహిస్తూ రోడ్లపైకి నీరు చేరే అవకాశం ఉన్నది.కావున కాలి నడకన మరియు వాహనాలతో ప్రజలు రోడ్లు దాటేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు సూచించారు. సెల్ఫీల కోసం ఉధృతం గా ప్రవహిస్తున్న ప్రదేశాలకు వెళ్లి ప్రమాదాలకు గురి కావద్దని తెలిపారు. జిల్లా పోలీసు యంత్రాంగం ఇతర శాఖలతో కలిసి ఇప్పటికే వర్షాల కారణంగా ప్రమాదకరంగా మారుతున్న రహదారులు మరియు చెరువులు,వాగులు,నదుల వద్ద ఎలాంటి ప్రమాదాలు జరగకుండా పటిష్టమైన చర్యలు చేపట్టడం జరుగుతుందని తెలియజేసారు. వరదల్లో చిక్కుకుని ఆపదలో ఉన్న వారిని రక్షించడానికి జిల్లా పోలీస్ శాఖ తరపున 24ఐ7 అందుబాటులో ఉండే విధంగా డిడిఆర్ఎఫ్ బృందాలను సిద్ధంగా ఉంచడం జరిగిందని తెలిపారు.ప్రజలు ఎవరైనా విపత్కర పరిస్థితులను ఎదుర్కొంటున్నట్లయితే వెంటనే డయల్ 100 కి ఫోన్ చేసి సమాచారం అందించి పోలీసు వారి సేవలను పొందాలని కోరారు. ప్రమాదాలు వాటిల్లకుండా పోలీసు వారు చేపట్టే చర్యలకు ప్రజలు సహకరించాలని ఈ సందర్భంగా ఎస్పీ విజ్ఞప్తి చేశారు.

## మొగిలిపాక కు బస్సు సౌకర్యం పునరుద్ధరణ.




సీకే న్యూస్ వలిగొండ మండలం ప్రతినిధి బాలరాజు జూలై 2. యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల పరిధిలోని మొగిలిపాక గ్రామానికి ఐదేళ్ల తర్వాత బస్సు సౌకర్యాన్ని అధికారులు పునరుద్ధరించాలని, కాంగ్రెస్ నాయకులు మీడియా ద్వారా మాట్లాడినారు, ముద్దసాని రామచంద్ర రెడ్డి ప్రయత్నాలతో ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి చొరవతో బుధవారం బస్సు సర్వీసు ప్రారంభించారు, ఈ సందర్భంగా గ్రామస్తులు జిల్లా నాయకులు మామిడి సత్తిరెడ్డి సమక్షంలో కాంగ్రెస్ కార్యకర్తలు ఎమ్మెల్యే కి కృతజ్ఞతలు తెలిపినారు.

## తోకల వారి పుష్పాలంకరణ మహోత్సవం కార్యక్రమానికి హాజరైన పెబ్బేరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు



సి కె న్యూస్ ప్రతినిధి పెబ్బేర్ :పెబ్బేర్ మండల్ మండల కేంద్రంలో అయోధ్య ఫంక్షన్ హాల్ లో బిటి శివ కుమార్తె పుష్పాలంకరణ కార్యక్రమానికి పెబ్బేరు మండల్ రియల్ ఎస్టేట్ వ్యాపారులు పాల్గొని హిమజ ని కి శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది ఈ కార్యక్రమంలో పెబ్బేర్ మండలం రియల్ ఎస్టేట్ వ్యాపారులు (పామాపురం) అల్లాడి శ్రీనివాస్ గౌడ్ సీనియర్ రియల్ ఎస్టేట్ వ్యాపారి, మరియు పెబ్బేర్ మైబు, అయ్యవారిపల్లి రవీందర్ నాయుడు, వెంకటాపూర్ శంకర్ నాయుడు (పెబ్బేరు మండల్ జర్నలిస్ట్), మరియు గోపాల్, బోలు గరీ సత్యం, లిటిల్ స్కాలర్స్ డ్రైవర్స్ తదితరులు పాల్గొని హిమజని ఆశీర్వదించడం జరిగింది. నిండు నూరేళ్లు సంతోషంగా ఉండాలని దీవించారు.

# డాక్టర్స్ డే .. డాక్టర్ నిర్లక్ష్యానికి పసికందు మృతి

- పాల్వంచ ప్రభుత్వ ఆసుపత్రిలో డాక్టర్స్ డే రోజున పసికందు మృతి.
- డాక్టర్ నిర్లక్ష్యం వహించారంటూ బంధువుల ఆరోపణ
- ప్రైవేట్ హాస్పటల్ పై చూపించే శ్రద్ధ పేషంట్లపై చూపిస్తే బాగుండేది
- నొప్పులు తట్టుకోలేక ఆపరేషన్ చేయమని ప్రాధేయపడిన పట్టించుకోని ఆసుపత్రి సిబ్బంది
- డాక్టర్ పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బంధువుల డిమాండ్
- పాల్వంచ పోలీస్ స్టేషన్లో భర్త ఫిర్యాదు
- ప్రభుత్వ ఆసుపత్రి డ్యూటీలో ఉంటూనే ప్రైవేట్ ఆసుపత్రికి వెళ్లి చికిత్సలు చేస్తున్న డాక్టర్



సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా/పాల్వంచ ప్రతినిధి, ( సాయి కౌశిక్),జూలై 02,వైద్యో నారాయణ హరి అని వైద్యుని దేవుడితో పోలుస్తూ స్మరించుకునే రోజున పాల్వంచ పట్టణం లో ప్రభుత్వ ఆసుపత్రిలో ఓ నిండు గర్భిణీ మనోవేదన పలువురిని శ్లోక సముద్రంలో ముంచింది. లక్ష్మీదేవి పల్లి మండలం తోక భాంధల గ్రామానికి చెందిన కరుణ (23) ప్రసవం కోసం వచ్చిన గర్భిణీని పలు విధాలుగా ఇబ్బందికి గురి చేస్తూ నొప్పులు వస్తున్నాయని తట్టుకోలేక ఆపరేషన్ చేయమని రెండు చేతులు జోడించి ప్రాధేయపడిన కనికరించని డాక్టర్ ఆసుపత్రి సిబ్బంది. ఆరోగ్యంగా ఉన్న పసికందు మరికొద్ది సేపట్లో ప్రసవించవలసి ఉండగా నిర్జీవంగా ఆ బిడ్డను తల్లికి అప్పగించారు.

తల్లి బిడ్డ ఇద్దరూ ఆరోగ్యంగా ఉన్నారని మానిటరింగ్ చేస్తూ నార్మల్ డెలివరీ చేయాలని చెప్పి డాక్టర్ అనూష ప్రభుత్వ ఆసుపత్రి నుండి బయటికి వెళ్లారని తరువాత నిండు గర్భిణీ అయిన కరుణాకు నొప్పులు రావడంతో భరించలేక తల్లడిల్లిన స్థితిలో హడావుడి చేసి ఆపరేషన్ థియేటర్ కు తీసుకెళ్లి బిడ్డ చనిపోయాడు అని బంధువులకు అప్పగించి చేతులు దులుపుకున్నారు. ఆపరేషన్ కి స్ట్రక్చర్ పై తీసుకు వెళుతున్న ఆయాలు డబ్బులు డిమాండ్ చేయడం కోసమేరుపు.ఇదేమిటని బంధువులు ప్రశ్నించగా నార్మల్ డెలివరీ కోసం ప్రయత్నించామని తప్పని పరిస్థితుల్లో ఆపరేషన్ చేశామన్నారు. కానీ పసికందు ప్రాణాలను కాపాడలేకపోయామని పలు కారణాలు చెబుతూ తప్పించుకునే ప్రయత్నం చేశారు.

కరుణ బంధువులు డాక్టర్ను నిలదీయగా సాధారణంగా ఇలాంటి సంఘటనలు జరగవని ఎక్కడో ఒకటి ఇలాంటి పరిస్థితి జరుగుతుందని సినిమాలో చెప్పిన రీతిగానే నిజజీవితంలో కూడా తెలియజేసిన డాక్టర్లు అందుకు మా బాధ్యత కాదంటూ నిర్లక్ష్యపు సమాధానం చెప్పారంటూ బంధువులు ఆరోపించారు. గర్భిణీ స్త్రీ ప్రసవ నొప్పులు తట్టుకోలేక ఆపరేషన్ చేయమని ప్రాధేయపడిన డాక్టర్ ఆసుపత్రి సిబ్బంది నిర్లక్ష్యం వహించారని, జాగ్రత్త వహించి ఉంటే బిడ్డ చనిపోయేవాడు కాదని, డాక్టర్ నిర్లక్ష్యంతో తల్లికి కూడా ప్రమాదం జరిగి ప్రాణాలు కోల్పోతే ఎవరు బాధ్యత వహిస్తారు అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.9 నెలలు బిడ్డను మోస్తూ బిడ్డకు జన్మను ఇవ్వాలని ఎంతో ఆశతో వచ్చిన వారికి నిరాశ ఎదురయింది. నిర్జీవంగా ఉన్న శిశువును వారికి బహుమతిగా ఇచ్చారు. ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరించిన డాక్టర్ ఆసుపత్రికి సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలని బంధువులు పాల్వంచ పట్టణ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఇటువంటి సంఘటనలు మరల చోటు చేసుకోకుండా డబ్బు ఉన్నవారికి లేనివారికి ఒకే విధంగా వైద్యం చేయాలని, పసికందు మరణానికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని బంధువులు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం రాత్రి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా ఎఫ్ఐఆర్ నమోదు చేసిన స్టేషన్ సిబ్బంది. బుధవారం నిర్జీవ శిశువును పోస్టుమార్టం చేసి బంధువులకు అప్పగించారు. చనిపోయిన శిశువును తీసుకొని తిరుగు ప్రయాణమైన బంధువులు. భద్రాద్రి జిల్లా అంటేనే గిరిజన జిల్లా అటువంటి జిల్లాలో గిరిజనులకు అడుగడుగున అన్యాయమే జరుగుతుంది. కలెక్టర్ భార్య ఇక్కడ డెలివరీ అయింది మనల్ని కూడా మంచిగానే చూస్తారని ఆశతో ఇక్కడికి వచ్చిన వారికి చేదు అనుభవం ఎదురయింది. ఉన్నవారికి ఒక తీరుగా లేని వారికి ఒక తీరుగా ఇక్కడ చూస్తారు అని నిరూపించిన పాల్వంచ ప్రభుత్వ ఆసుపత్రి డాక్టర్లు సిబ్బంది. ఏది ఏమైనాపటికి ఇటువంటి సంఘటనలు పునరావృత్తం కాకుండా డాక్టర్ పై హాస్పిటల్ సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్న బంధువులు స్నేహితులు. ప్రభుత్వ ఆసుపత్రిలో విధులు నిర్వహించే డాక్టర్లు మాస్టర్ పడి వారి ప్రైవేట్ హాస్పటల్ కు వెళ్తున్నారని డ్యూటీలో ఉండి వారి ప్రైవేట్ ఆసుపత్రి పైనే ఎక్కువ శ్రద్ధ చూపిస్తారని. దాన్లో భాగంగానే చిన్నారి మృతి చెందిందని ఆరోపిస్తున్న బాధితులు.

## ప్రతి నాయకునికి క్రమశిక్షణ ఎంతో ముఖ్యం



- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- ఖర్గే పర్యటన విజయవంతం పై కాంగ్రెస్ శ్రేణులకు దిశా నిర్దేశం

సి కె న్యూస్ ప్రతినిధి

రాజకీయాల్లో ఉండాలనుకున్న ప్రతి నాయకునికి, ప్రతి కార్యకర్త కు క్రమశిక్షణ ఎంతో ముఖ్యమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. జిల్లా కాంగ్రెస్ కార్యాలయం సంజీవరెడ్డి భవనంలో బుధవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పువ్వాళ్ళ దుర్గా ప్రసాద్ అధ్యక్షతన పట్టణ,మండల,గ్రామ బూత్ స్థాయి అధ్యక్షులతో మల్లిఖార్జున ఖర్గే హైదరాబాద్ పర్యటన విజయవంతం పై దిశా నిర్దేశ సమావేశం నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తో పాటు పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురామి రెడ్డి, ఖమ్మం జిల్లా ఇన్చార్జులు టిపిసిసి మాజీ అధ్యక్షులు డాక్టర్ శ్రవణ్ కుమార్ రెడ్డి, శ్రీ చక్కిలం రాజేశ్వర్ రావు, దైద రవీందర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా తుమ్మల నాగేశ్వరావు మాట్లాడుతూ..... ఏ స్థాయి నాయకుడైన ప్రజాభిమానం పొందాలంటే ముందుగా క్రమశిక్షణ అలవర్చుకోవాలని క్రమశిక్షణ లేకుండా ఏ వ్యవస్థలోనైనా రాణించడం కష్టమని తెలిపారు. జై భీం, జై బాపు, జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా అఖిల భారత కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ఈ నెల 4వ తేదీన హైదరాబాద్ రానున్నారని తెలియజేశారు.ఖమ్మం జిల్లా నుండి అన్ని నియోజక వర్గాల్లో పట్టణ స్థాయి నుండి బూత్ స్థాయి అధ్యక్షులు వరకూ ఒకరికి ఒకరు సమన్వయ పరచుకొని జిల్లా నుండి భారీగా తరలి ఖర్గే పర్యటనను విజయవంతం చేయాలని కోరారు. రాజ్యాంగ ఆవశ్యకతను మారుమూల గ్రామాల్లోకి చేరవేయడమే లక్ష్యంగా ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ జై భీమ్, జై బాపు జై సంవిధాన్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని అన్నారు. ఇందులో భాగంగానే పార్టీలో కొత్తగా కార్యవర్గ కమిటీలను కూడా నిర్ణయించడం జరుగుతుందని తెలిపారు. జిల్లా నుండి బస్సులను ఏర్పాటు చేస్తున్నామని అత్యధిక మంది కార్యకర్తలు హాజరయ్యే విధంగా డివిజన్ బూత్ స్థాయి అధ్యక్షులు కృషి చేయాలని తెలిపారు. అంతేకాకుండా నేడు రాష్ట్రంలో బీఆర్ఎస్ తన మనుగడను కాపాడుకునే ప్రయత్నం చేస్తుందని అందుకు కోసం కాంగ్రెస్ పై తప్పుడు ఆరోపణలు దిగిందని విమర్శించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. పోలవరం బనకచర్ల ప్రాజెక్ట్ లపై బీర్ఎస్ చేసే ఆరోపణల్లో ఎలాంటి వాస్తవం లేదని సెంటిమెంట్ తో మరో మారు రాష్ట్రంలో అలజడి సృష్టించాలని చూస్తున్నారని విమర్శించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా నేడు తెలంగాణలో సంక్షేమ పథకాలు అమలు అవుతున్నాయని అన్నారు. అనంతరం ఎంపీ రఘురామిరెడ్డి, టీపీసీసి మాజీ అధ్యక్షులు శ్రావణ్ కుమార్ రెడ్డి, శ్రీ చక్కిలం రాజేశ్వర్ రావు, దైద రవీందర్ లు మాట్లాడుతూ.... ఖమ్మం అంటేనే కాంగ్రెస్ అని రాష్ట్రంలో ఏ జిల్లా లో రాని మెజారిటీ ఖమ్మం జిల్లా నుండే వచ్చిందని అదే ఉత్సాహంతో 4వ తేదీన హైదరాబాద్ లో జరిగే ఖర్గే పర్యటన విజయవంతం చేయాలని కోరారు. అనంతరం జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గా ప్రసాద్. రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వర్ రావు, నగర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మహమ్మద్ జావేద్ లు మాట్లాడుతూ జై బాపు జై భీమ్ జై సంవిధాన్ అనే కార్యక్రమం ద్వారా ఈ దేశానికి ఒక గొప్ప సందేశాన్ని ఇవ్వబోతున్నామని దాన్లో భాగంగానే అఖిల భారత కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే హైదరాబాదులో పర్యటించనున్నారని అన్నారు. పట్టణ,డివిజన్, మండల, గ్రామ బూతు స్థాయి అధ్యక్షులు చురుకుగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ఈ కార్యక్రమంలో వీరితో పాటు మాజి శాసనమండలి సభ్యులు బాలసాని లక్ష్మీనారాయణ, నగర వర్కింగ్ ప్రెసిడెంట్ నాగండ్ల దీపక్ చౌదరి, మంత్రి వర్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి గారి. క్యాంపు కార్యాలయ ఇంచార్జి తుమ్మూరు దయాకర్ రెడ్డి, ఖమ్మం బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు యర్రం బాలగంగాధర్ తిలక్, జిల్లా అనుబంధ సంఘ అధ్యక్షులు కొత్తా సీతారాములు, దొబ్బల సౌజన్య, మొక్కా శేఖర్ గౌడ్, బొడ్డు బొందయ్య, సయ్యద్ ముజాహిద్ హుస్సేన్, సయ్యద్ గౌస్, రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శి యడ్లపల్లి సంతోష్,మిక్కిలినేని నరేంద్ర, సాధు రమేష్ రెడ్డి,నగర ఓబీసీ, ఐ యన్ టి యు సి, మైనారిటీ అధ్యక్షులు బాణాల లక్ష్మణ్, నరాల నరేష్,షేక్ అబ్బాస్, జిల్లా లోని అన్ని మండలాల నుండి విచ్చేసిన బ్లాక్, మండల, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## డిగ్రీ సెమిస్టర్ ఫలితాలలో మాతృశ్రీ ప్రభంజనం

చౌటుప్పల్.జులై 02 సి కె న్యూస్ ప్రతినిధి బుధవారం మహాత్మాగాంధీ యూనివర్సిటీ ప్రకటించిన డిగ్రీ రెండవ,నాల్గవ,ఆరవ సెమిస్టర్ ఫలితాలలో చౌటుప్పల్ పట్టణ మున్సిపాలిటీ పరిధిలోని స్థానిక మాతృశ్రీ డిగ్రీ కళాశాలకు చెందిన ద్వితీయ సంవత్సరం విద్యార్థిని బొమ్మకంటి శ్రావణి బీఎస్సీ ఎంపీ సి ఎస్ విభాగంలో 10/10 జిపిఎస్ సాధించినట్లు కళాశాల ప్రిన్సిపల్ బి మహేందర్ రెడ్డి తెలిపారు. అలాగే తమ కళాశాల నుంచి మరో 25 మంది పైగా విద్యార్థులు 9.0 కంటే ఎక్కువ ఎస్ జి పి ఎ సాధించి ఉత్తమ ప్రతిభను కనబరిచారన్నారు.

ఈ సందర్భంగా కళాశాలలో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ బి.మహేందర్ రెడ్డి మాట్లాడుతూ...విద్యార్థులు ప్రణాళికతో చదువుతూ..లక్ష్య సాధనకై నిత్యం కృషి చెయ్యాలని తెలిపారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు పుష్పగుచ్ఛం ఇచ్చి సత్కరించి అభినందించారు.

ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ బి మహేందర్ రెడ్డి, అధ్యాపక బృందం, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## పెద్దపెండ్యాల మాజీ సర్పంచ్ తోట స్రవంతి అకాల మరణం బాధాకరం. ఎంపీ డా. కడియం కావ్య, ఎమ్మెల్యే కడియం శ్రీహరి.



సీకే న్యూస్ జూలై 2 హన్మకొండ జిల్లా ధర్మసాగర్ మండలం ప్రతినిధి కమలాకర్:ధర్మసాగర్ మండలం పెద్దపెండ్యాల గ్రామ మాజీ సర్పంచ్ తోట స్రవంతి గారు అనారోగ్యంతో అస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందడం అత్యంత బాధాకరమని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య, మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. పెద్దపెండ్యాలలోని స్వగృహానికి వెళ్లి ఆమె భౌతికకాయనికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని ప్రసాధించాలని ప్రార్థించారు. ఎమ్మెల్యే వెంట మండల ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## సైబర్ నేరాలపై అవగాహన సదస్సు బోనాల లో



జులై 02 (సి కె న్యూస్) చేగుంట:చేగుంట మండలం బోనాల గ్రామంలో చేగుంట సబ్ ఇన్స్పెక్టర్ చైతన్య కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై అవగాహన సదస్సు ప్రజలకు నిర్వహిస్తూ, ఎవరైనా మేము బ్యాంకు నుంచి ఫోన్ చేసి అమౌంట్ వస్తుంది మికు ఓటిపి వచ్చింది చెప్పాలని, వారు అడిగితే మీరు ఎవరు అని అడిగి తెలుసుకుని మేమే బ్యాంకుకు వస్తామని వారికి సమాధానం ఇవ్వాలి, లేదా టోల్ ఫ్రీ నెంబర్ 1930 కి ఫోన్ చేయాలి ఈ కార్యక్రమంలో ఎస్సై 2 బిక్య నాయక్, కానిస్టేబుల్స్, ప్రజలు పాల్గొన్నారు

# ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో ప్రజలు, అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి.

**జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్.**



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, (సాయి కౌశిక్)జూలై 02,** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఎడతెరిపి లేకుండా విస్తారంగా కురుస్తున్న వర్షాల కారణంగా నదులు, వాగులు, చెరువులు పొంగిపొర్లే అవకాశం ఉంది. రోడ్లపైకి నీరు చేరే పరిస్థితులు ఏర్పడవచ్చు. ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని, బయటకు రావాల్సి వస్తే అప్రమత్తంగా ఉండాలని, అదేవిధంగా అధికారులు మరియు సిబ్బంది కూడా అప్రమత్తంగా ఉండి ప్రజలకు అందుబాటులో ఉండాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచించారు.

సెల్ఫీలు తీసుకోవడానికి పొంగిపొర్లుతున్న వాగులు, చెరువులు, నదుల వద్దకు వెళ్లి ప్రమాదాలకు లోనుకావద్దని ఆయన సూచించారు.

విపత్కర పరిస్థితులు తలెత్తినప్పుడు ప్రజలు తక్షణమే జిల్లా కలెక్టరేట్‌లో....... లేదా ఆర్డీవో కార్యాలయాల్లో ......ఏర్పాటు చేసిన హెల్ప్‌లైన్ నంబర్లకు, లేదా తమ మండల తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాలకు కాల్ చేసి సమాచారం అందించి సహాయం పొందవచ్చని కలెక్టర్ తెలిపారు.

జిల్లా అధికారులు, డివిజన్ స్థాయి అధికారులు మరియు అన్ని మండల అధికారులు అప్రమత్తంగా ఉండి, వర్షాల కారణంగా ఏర్పడే పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ప్రజలకు అందుబాటు లో ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. ఎలాంటి అత్యవసర పరిస్థితులు ఏర్పడిన సందర్భంలో సంబంధిత రెవెన్యూ, పోలీసు, రోడ్లు, మున్సిపల్ మరియు పంచాయతీ శాఖలతో సమన్వయం చేసుకుని తక్షణమే చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు.

ప్రస్తుతం పడుతున్న వర్షాల సందర్భంలో అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండటాన్ని అలవాటుగా చేసుకోవాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ఈ సమయంలో వర్షాలకు తీసుకునే ముందు జాగ్రత్తలు, అప్రమత్తత చర్యలు రాబోయే గోదావరి వరదల సమయంలో కూడా ఉపయోగ పడతాయని, ఎప్పుడైనా వచ్చే వరదలకు సకాలంలో స్పందించడానికి అధికారులు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండే విధంగా ప్రణాళికాబద్ధంగా పని చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు.

ప్రమాదాలను నివారించడానికి అధికారులు చేపట్టే చర్యలకు ప్రజలు సహకరించాలని ఈ సందర్భంగా కలెక్టర్ జితేష్ వి పాటిల్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# దుమ్ముగూడెం గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాల ఆకస్మిక తనికి చేసిన ఐటిడిఏ పిఓ.





**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),జూలై 02,**


గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలలో చదువుకున్న విద్యార్థిని విద్యార్థులకు చదువుతో పాటు వారికి ఇష్టమైన కళల పట్ల మక్కువ కలిగించి వారిలో దాగివున్న ప్రతిభా నైపుణ్యాలను వెలికి తీయాలని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ అన్నారు.

బుధవారం దుమ్ముగూడెం మండలంలోని కొత్తపల్లి బాలుర ఆశ్రమ పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి పాఠశాల పరిసరాలు తరగతి గదులు లైబ్రరీ రూము విద్యార్థులకు బోధిస్తున్న పాఠ్యాంశాల ను ఆయన పరిశీలించారు. ముందుగా మూడో తరగతి నుండి 5వ తరగతి వరకు చదువుతున్న పిల్లలకు ఇంగ్లీష్ పదాలను బోర్డుపై వ్రాయించి వాటి అర్థాలను తెలుగులో చెప్పించుకున్నారు. అనంతరం ఆరు నుండి 9వ తరగతి వరకు నిర్వహిస్తున్న క్లాసులను ఉపాధ్యాయులు బోధిస్తున్న బోధనా తీరును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నారులకు వారికి అర్థమయ్యే రీతిలో ఇంగ్లీష్ పదాలను వారి చేత బోర్డుపై రాయించి వాటి అర్థాలను తెలుగులో పూర్తిగా చెప్పేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, ఈ సంవత్సరం ప్రతిరోజు బోధించే పాఠ్యాంశాలతో పాటు అదనంగా విద్యార్థులకు ఇష్టమైన వ్యాసరచన, క్విజ్, నాటికలు, ఏకపాత్రాభినయానికి సంబంధించిన కళల పట్ల అవగాహన కల్పించాలని ఉపాధ్యాయులకు సూచించారు. వాటికి సంబంధించిన ప్రణాళికలు రూపొందించి అన్ని పాఠశాలలకు పంపిస్తామని ఉపాధ్యాయులు తప్పనిసరిగా ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. వర్షాకాలం నడుస్తున్నందున విద్యార్థుల ఆరోగ్యం పై ప్రత్యేక దృష్టి సారించాలని, విషపూరితమైన క్రిమి కీటకాలు సంచరిస్తూ ఉంటాయని కనుక రాత్రిపూట విద్యార్థులు ఎవరు బయటకు రాకుండా చూడాలని, ప్రతిరోజు వంటగది శుభ్రం చేసి మెనూ ప్రకారము విద్యార్థులకు వేడిగా ఉన్న ఆహారాన్ని వడ్డించాలని అన్నారు. పాఠశాల ఆవరణ శుభ్రంగా ఉండేలా చూడాలని, పాఠశాల చుట్టూ వర్షపు నీరు నిలవకుండా సైడ్ డ్రైన్లు శుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు.

ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం నరసింహారావు మరియు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణ మన అందరి బాధ్యత...శ్రీరాములు అందెల..

- **చెట్లను నాటుదాం..! పర్యావరణాన్ని కాపాడుదాం..!!**
- **బిజెపి కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు కొండపల్లి శ్రీధర్ రెడ్డి..**



**రంగారెడ్డి జిల్లా, మహేశ్వరం, జులై 02, సి కె న్యూస్** మహేశ్వరం నియోజకవర్గం బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ లోని నాదర్గుల్ గ్రామంలో శ్యామ ప్రసాద్ ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివస్ పురస్కరించుకొని గురువారం బిజెపి కిసాన్ మోర్చా ఏపీఎంసీ కన్వీనర్, మాజీ ఎంపీటీసీ సభ్యులు ఏనుగు రామ్ రెడ్డి ఆధ్వర్యంలో వారి వ్యవసాయ క్షేత్రంలో కిసాన్ సంవాద్ కార్యక్రమంలో భాగంగా అమ్మ పేరుతో మొక్కలు నాటే కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బిజెపి రాష్ట్ర కిసాన్ మోర్చా అధ్యక్షులు కొండపల్లి శ్రీధర్ రెడ్డి, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మహేశ్వరం నియోజకవర్గ ఇన్చార్జ్ అందెల శ్రీరాములు మాజీ రంగారెడ్డి రూరల్ జిల్లా బిజెపి అధ్యక్షులు బొక్క నర్సింహారెడ్డి హాజరై మొక్కలను నాటడం జరిగింది. ఈ సందర్భంగా కొండపల్లి శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ రోజురోజుకు ప్లాస్టిక్ వాడకం అధికం కావడంతో పర్యావరణం పై పేను ప్రభావం పడుతుందన్నారు. ప్రతి ఒక్కరూ మానవత దృక్పథంతో తమ వంతుగా చెట్లను నాటి పర్యావరణన్ని పరిరక్షించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంజయ్య యాదవ్, బిజెపి రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ తర్రే మల్లేష్ యాదవ్, కార్పొరేషన్ బిజెపి అధ్యక్షులు రామిడి వీరకర్ణ రెడ్డి, బిజెపి సీనియర్ నాయకులు ఏనుగు ప్రభాకర్ రెడ్డి, మాజీ కార్పొరేషన్ అధ్యక్షులు చెరుకుపల్లి వెంకట్ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు తోట శ్రీధర్ రెడ్డి, నిమ్మల సునీత శ్రీకాంత్ గౌడ్, గూడెపు ఇంద్రసేన, గడ్డం లక్ష్మారెడ్డి, దడిగ శంకర్, రామోజీ అమితా శ్రీశైలం చారి, సహకార బ్యాంక్ డైరెక్టర్ తోట ప్రతాపరెడ్డి, మాజీ సహకార బ్యాంక్ డైరెక్టర్ ఏనుగు వెంకట్ రెడ్డి, బిజెపి సీనియర్ నాయకులు పాలు బాయ్ లక్ష్మణ్, గూడూరు శేఖర్ రెడ్డి, ఏనుగు రామ్ రెడ్డి, మర్రి అంజిరెడ్డి, శక్తి కేంద్ర ఇన్చార్జ నిమ్మల రవికాంత్ గౌడ్, ఏనుగు బుచ్చిరెడ్డి, ఏనుగు జంగారెడ్డి, తోట అరేందర్ రెడ్డి, మంత్రి శ్రీధర్ ముదిరాజ్, బంగారు సుమన్, లాలం బాల నరసింహ యాదవ్, ఎడ్ల శ్రీశైలం ముదిరాజ్, భాస్కర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ గురుజాల రామలింగేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించిన.. ఎమ్మెల్యే బివి



**ఎమ్మిగనూరు జులై 02,సి కె న్యూస్** నందవరం మండల పరిధిలోని గురుజాల గ్రామంలో వెలసిన మహిమన్వితుడు శ్రీ గురుజాల రామలింగేశ్వర స్వామి దేవాలయాన్ని ఎమ్మిగనూరు ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయనాగేశ్వర్ రెడ్డి సందర్శించి, స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి ఆశీస్సులు తీసుకున్నారు. ఆలయానికి విచ్చేసిన ఎమ్మెల్యేకు ఆలయ పండితులు ఘనంగా స్వాగతం పలికారు. ఎమ్మెల్యే వెంట స్థానిక ప్రజాప్రతినిధులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, యువకులు, తదితరులు ఉన్నారు.

# కూటమి ప్రభుత్వ ఏడాది పాలనా విజయాలను ప్రజలకు వివరించిన... ఎమ్మెల్యే బివి.



**ఎమ్మిగనూరు జులై 02,సి కె న్యూస్** రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో భాగంగా నందవరం మండల పరిధిలోని మిట్ట సోమపురంలో ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయనాగేశ్వ ర రెడ్డి బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వ ఏడాది పాలనా విజయాలను ప్రజలకు వివరించారు. అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల పట్ల అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, యువకులు, తదితరులు పాల్గొన్నారు.

# సీఎం సహాయ నిధి చెక్కు అందజేత



**చౌటుప్పల్.జులై 02, సి కె న్యూస్** యాదాద్రి భువనగిరి జిల్లా,చౌటుప్పల్ మున్సిపాలిటీ లో 11వ వార్డుకు చెందిన బాల్యం చంద్రయ్య కి అత్యవసర చికిత్స నిమిత్తం మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సహకారంతో మంజూరైన సీఎం సహాయనిది చెక్కును బుధవారం మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య చేతుల మీదుగా లబ్ధిదారునికి 75000 వేల రూపాయల ఎల్ఓసిని అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి చిలుకూరు ప్రభాకర్ రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఆకుల ఇంద్రసేనారెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు బోయ దేవేందర్,మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సుర్వి నరసింహ గౌడ్, మాజీ కౌన్సిలర్ కొయ్యడ సైదులు గౌడ్,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గుండు మల్లయ్య, మెగుదాల రమేష్ గౌడ్, 11వ వార్డ్ అధ్యక్షులు గోష్క వినయ్, గుర్రం పాండురంగం తదితరులు పాల్గొన్నారు.


# వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా బీసీ విభాగ కార్యదర్శిగా వడ్డే వీరేష్ నియామకం.

- **హర్షం వ్యక్తం చేస్తూ ఎంపిక చేసిన పార్టీ నాయకత్వానికి...**
- **కృతజ్ఞతలు తెలిపిన..వడ్డే వీరేష్.**

**ఎమ్మిగనూరు టౌన్, జులై 02,సి కె న్యూస్** నియామకం పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు, ఎమ్మిగనూరు నియోజకవర్గ ఇంచార్జ్, మాజీ ఎంపీ బుట్టా రేణుక సహకారం తోఎమ్మిగనూరు పట్టణానికి చెందిన యువ నాయకుడు వడ్డే వీరేష్ ను వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కర్నూలు జిల్లా బీసీ విభాగ కార్యదర్శిగా పార్టీ కేంద్ర కార్యాలయం నియమించింది. ఈ సందర్భంగా వడ్డే వీరేష్ గారు మాట్లాడుతూ నన్ను ఈ బాధ్యతకు ఎంపిక చేసిన పార్టీ నాయకత్వానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలుపుతున్నానని,ముఖ్యంగా మా నియోజకవర్గ ఇంచార్జ్ బుట్టా రేణుక కు, పార్టీ సీనియర్ నాయకులు బుట్టా శివ నీలకంఠ కు, రాష్ట్ర యువజన విభాగ ఉపాధ్యక్షులు బుట్టా ప్రతుల్ కు కృతజ్ఞతలు తెలిపారు. బీసీ వర్గాలకు న్యాయం జరిగే విధంగా, పార్టీ విలువలు పాటిస్తూ నా బాధ్యతలను నిర్వర్తిస్తానని,పార్టీ విజయానికి నన్ను ఉపయోగించుకునేలా పనిచేస్తానని తెలిపారు.

## అర్హులై, ఇల్లు నిర్మించుకోవడానికి సిద్ధంగా ఉన్న వారికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయండి

● యాచారం ఎంపీడీఓ కు పగడాల శ్రీశైలం వినతి.



**యాచారం జులై 2 సి కె న్యూస్** మండల పరిధిలోని తక్కళ్లపల్లి గ్రామంలో అర్హులై, ఇల్లు నిర్మించుకోవడానికి సిద్ధంగా ఉన్న వారికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలనీ మరియు ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో కొలతలు సాకుతో బిల్లు ఇవ్వని వారికి తక్షణమే బిల్లులు ఇవ్వాలని యాచారం ఎంపీడీవో కు వినతిపత్రం అందజేసిన తక్కళ్లపల్లి మాజీ ఉప సర్పంచ్ పగడాల శ్రీశైలం..

కొలతలు అనేవి ప్రభుత్వం మొదట్లో సరైన అవగాహనా కల్పించని కారణంగే లబ్ధిదారులు కట్టుకున్నారు.. కావున వారికి తక్షణమే బిల్లు ఇవ్వాలని కోరడమైనది...

## సీసీ కెమెరాల ఏర్పాటుతో దొంగతనాల ను నిర్మూలించవచ్చు

ఇబ్రహీంపట్నం ఏసిపి రాజు

మజిక్ సింగారం గ్రామంలో సీసీ కెమెరాలు ప్రారంభం.




**యాచారం జులై 2 సి కె న్యూస్** యాచారం మండలం సింగారం గ్రామంలో సీ సి కెమెరాలు ఏర్పాటు చేయడం జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్య అతిదులుగా ఇబ్రహీంపట్నం ఏసిపి రాజు ,యాచారం సి ఐ నందీశ్వర్ రెడ్డి గారు పాల్గొన్నారు.%ఎ%ఎ% కెమెరాల వల్ల దొంగతనాలు,అసాంఘిక కార్యక్రమాలు పాల్పడుతున్న వారిని తొందరగ గుర్తించే అవకాశం ఉంటుందని తద్వారా నేరాలు తగ్గుతాయని వారు అన్నారు,గ్రామంలో యువత చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా సమాజ హిత కార్యక్రమాలలో పాల్గొనాల్సిందిగా వారు కోరారు, ఆదిరెడ్డి హరీష్ రెడ్డి మరియు హర్షద్ గారి సహకారంతో గ్రామంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ వన్నవాడ అరుణ పాండురంగా రెడ్డి గారు ,చైతన్య యూత్ క్లబ్ అధ్యక్షులు వన్నవాడ రవీందర్ రెడ్డి గారు , యువ నాయకులు కడారి శ్రీశైలం గారు , ఆనంద్ శర్మ గారు , రాఘవేందర్ రెడ్డి ,శివ , ప్రకాష్ , మాధవ్ , చంద్రకాంత్ , బాలాకుమార్ , గా ల య్య,గ్రామ యువజన సంఘాల నాయకులు, గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

## శ్రీ ఆందోల్ మైసమ్మ దేవస్థానం హుండీ లెక్కింపు



**చౌటుప్పల్.జులై 02. సి కె న్యూస్** యాదాద్రి భువనగిరి జిల్లా, చౌటుప్పల్ మండలం, దండు మల్కాపురం గ్రామ పరిధిలోని శ్రీఆంతోల్ మైసమ్మ దేవస్థానం హుండీని బుధవారం దేవాలయ ఆవరణలో అధికారుల సమక్షంలో లెక్కించగా 105 రోజులకు గాను 10,94,990 రూపాయలు వచ్చినట్లు దేవస్థానం కార్యనిర్వాహణ అధికారి సల్వాది మోహన్ బాబు పత్రికకు ఇచ్చిన ప్రకటన ద్వారా తెలియజేశారు .ఈ కార్యక్రమంలో సహాయ కమిషనర్ కే భాస్కర్, దేవస్థానం చైర్మన్ చిలుకూరి మల్లారెడ్డి, ధర్మకర్తలు బుర్ర స్వామి గౌడ్, కంచర్ల ప్రవీణ్ రెడ్డి, అత్తాపురం అంజిరెడ్డి, గుండ్ల అశోక్, చింతంపల్లి జంగయ్య, ఎల్లంకి రమేష్ చారి, ఎద్దుల పరమేష్ యాదవ్, చేపూరి మహేష్, పబ్బు కిరణ్ గౌడ్, సంఘం యాదమ్మ మల్లేష్, అర్చకులు శివప్రసాద్ శర్మ, జూనియర్ అసిస్టెంట్ ఏ. సత్తిరెడ్డి భక్తులు పాల్గొన్నారు.

# పంట పొలాలకు పిల్లకాలువల నిర్మాణం చేపట్టాలి.



**దేవనకొండ జూలై 02 సి కె న్యూస్** హంద్రీ-నీవా ప్రధాన కాలువ కు గుండ్లకొండ దగ్గర సబ్ కెనాల్ ఏర్పాటు చేసి గుండ్లకొండ, కె.వెంకటాపురం,మాదాపురం, గుడిమిరాల, బంటుపల్లి, బండపల్లి, బేతపల్లి, చెల్లెల చెల్లెల,పి. కోటకొండ మీదుగా మాచాపురం చెరువుకు నీళ్లు మళ్లించాలని సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యులు కె.మద్దిలేటి శెట్టి, సిపిఐ మండల కార్యదర్శి ఎమ్. నరసరావు లు తహసీల్దార్ ను కోరారు.రైతులు కలిసి సాగునీటి సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో హంద్రీ-నీవా ప్రధాన కాలువ ద్వారా దాదాపు 46 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించాల్సిన లక్ష్యం ప్రభుత్వం పై ఉందన్నారు. ఇప్పటివరకు హంద్రీ-నీవా ద్వారా మండలంలో కొన్ని గ్రామాల రైతులకు మాత్రమే సాగునీరు అందుతుందన్నారు. దాదాపు 75% గ్రామాల రైతాంగానికి ఇప్పటివరకు హంద్రీ-నీవా ద్వారా సాగునీరు అందడం లేదన్నారు. ప్రధానంగా హంద్రీ-నీవా ప్రధాన కాలువకు గుండ్లకొండ దగ్గర సబ్ కెనాల్ ఏర్పాటు చేసి గుడిమిరాళ్ల, కె.వెంకటాపురం, మాదాపురం, బంటుపల్లి, చెల్లెలచెలిమల, బేతపల్లి,బండపల్లి, పి.కోటకొండ మీదుగా మాచాపురం చెరువుకు హంద్రీ-నీవా ప్రధాన కాలువ ద్వారా సాగునీరు మళ్లించాలని గతంలో అనేకమార్లు అధికారులను, ప్రజాప్రతినిధులను కోరినప్పటికీ చర్యలు తీసుకోలేదన్నారు.పంట పొలాలకు పిల్ల కాలువల" నిర్మాణం చేపట్టాలన్నారు. ఇప్పటివరకు హంద్రీ-నీవా సాగునీటికి నోచుకోని "మిగులు గ్రామాలకు" సాగునీరు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు బజారి,కోమేష్, ఆంజనేయులు,భాస్కర్, వీరాంజనేయులు,సుబ్బయ్య శెట్టి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## 30 సంవత్సరాల తర్వాత సొంత కుటుంబానికి చేరిన యువకుడు....

● సబ్ కలెక్టర్ చరవతో 24 గంటల్లో కుటుంబానికి చేరిన యువకుడు వీరేష్ జనార్ధన్.

● ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ .



**ఎమ్మిగనూరు/జూలై:-01: సి కె న్యూస్** 30 సంవత్సరాల తర్వాత సొంత కుటుంబానికి చేరిన యువకుడు వివరాలు వెళితే ఆదోని పట్టానికి చెందిన వీరేష్ గత 30 సంవత్సరాల క్రితం 4 సంవత్సరాల వయసులో రైల్లో తప్పిపోయి తమిళనాడులో ప్రత్యక్షమయ్యాడు. అక్కడ బోర్డింగ్ లో కొద్దిరోజులు నివసించి. అక్కడనుండి ముంబై లోని అనాధాశ్రమమునకు బదిలీ చేశారు. అక్కడే పదవ తరగతి వరకు చదువుకొని హెూటల్లో వెయిటర్ గా పనిచేస్తున్నాడు. ఎప్పటికైనా సొంత వారిని కలుస్తానన్న ఆశ తగ్గలేదు. కేవలం అతనకు నానమ్మ అంజనమ్మ, నాన్న జనార్ధన్, ఊరు ఆదోని అని మాత్రమే తెలుసు. ఈ నేపథ్యంలోనే గత రెండు రోజుల నుంచి ఆదోని లో తిరుగుతున్న ఎటువంటి కుటుంబ సభ్యుల సమాచారం అందలేదు. సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక ఉన్నదని సమాచారం తెలుసుకొని ఆదోని సబ్ కలెక్టర్ గారికి తనకు జరిగిన విషయాన్ని తెలియజేశారు. అనంతరం సబ్ కలెక్టర్ వెంటనే స్పందించి మున్సిపల్ కమిషనర్ ఫోన్ ద్వారా వీరేష్ వివరాలు తెలియజేసారు. ఈ నేపథ్యంలో పట్టణంలో ఉండే సచివాలయాల్లో మరియు సామాజిక మాధ్యమం, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ద్వారా ప్రకటన విడుదల చేశారు. ప్రకటనల ద్వారా సమాచారాన్ని తెలుసుకున్న మేనత్త భర్త అయినా జగదీష్ సబ్ కలెక్టర్ కార్యాలయానికి విచ్చేశారు. జగదీష్ విషయాలను పూర్తిస్థాయిలో విచారణ చేపట్టాలని తహశీల్దార్ వారికి, మున్సిపల్ కమిషనర్ కు సబ్ కలెక్టర్ ఆదేశించారు. అనంతరం పూర్తిస్థాయిలో విచారణ చేపట్టగా వీరేష్ వారి అమ్మ వీరేష్ పుట్టిన సంవత్సరం లోపల మరణించిందని, వీరేష్ తండ్రి అనారోగ్యంతో 2008 సంవత్సరంలో మరణించాడని అలాగే వారి నానమ్మ అంజనమ్మ 2011వ సంవత్సరంలో మరణించారని తెలిపారు వారి కుటుంబ సభ్యులలో వారి మేనత్త లక్ష్మి (చిట్టెమ్మ) మాత్రమే జీవించారని ప్రస్తుతం వారు కర్నూలు నగరంలో నివసిస్తున్నారని విచారణలో తెలిపారు. చిన్నప్పుడు తను నివసించిన ప్రదేశాల్లో మేనత్త భర్త అయినా జగదీష్ తీసుకెళ్లి చూపించాడు. చూసిన వీరేష్ ఇవన్నీ నిజమేనని వీరు నా రక్త సంబాధికులే అని వీరేష్ అధికారులకు తెలిపారు.


ఈ సందర్భంగా వీరేష్ జనార్ధన్ మాట్లాడుతూ సబ్ కలెక్టర్ కు నేను చిన్న వయసులో తప్పిపోయాను, 30 సంవత్సరాలు అయిందని నా కుటుంబ సభ్యులను చూపించాలని ప్రజా సమస్య పరిష్కారాల వేదిక (పి.జి.ఆర్.ఎస్) లో సమస్యను తెలపగా సంబంధిత అధికారులకు ఆదేశించి, 24 గంటల్లోపే నాయొక్క కుటుంబ సభ్యుల చెంతకు తీసుకొచ్చిన సబ్ కలెక్టర్ గారికి, మరియు, మున్సిపల్ కమిషనర్, తహశీల్దార్, రెవెన్యూ, మీడియా సిబ్బందికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా మేనత్త భర్త అయినా జగదీష్ మాట్లాడుతూ వీరేష్ కొరకు చాలా రోజులుగా వెతికాము కానీ ఎటువంటి సమాచారం లేదు, 30 సంవత్సరాల తర్వాత వీరేష్ మమ్మల్ని వెతుక్కుంటూ రావడం చాలా భావిద్వేగానికి గురై సంతోషం గా ఉన్నది. వీరేష్ మా వరకు తీసుకొని వచ్చిన ప్రభుత్వ అధికారులకు, మీడియా కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం సబ్ కలెక్టర్ వారి కార్యాలయంలో వీరేష్, వారి కుటుంబ సభ్యులతో కలసి సబ్ కలెక్టర్ వారికి కృతజ్ఞతలు తెలియజేశారు.

## తీన్మార్ మల్లన్నకు మద్దతు తెలిపిన నాయకులు

**చౌటుప్పల్.జూలై 2. సి కె న్యూస్** యాదాద్రి భువనగిరి జిల్లా, చౌటుప్పల్ మున్సిపాలిటీ, తంగడపల్లి కి చెందిన గట్టు మొగలయ్య ముదిరాజ్, తంగడపల్లి ముదిరాజ్ సంఘం అధ్యక్షులు గట్టు వెంకటేష్ ముదిరాజ్ ల అధ్వర్యంలో ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న , తెలంగాణ బిసి పొలిటికల్ జె.ఏ సి కోఆర్డినేషన్ కమిటీ చైర్మన్ సుదగాని హరిశంకర్ గౌడ్ లని బుధవారం మర్యాద పూర్వకంగా కలిసి ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న చేపడుతున్న బిసి ఉద్యమానికి సంపూర్ణ మద్ధతు తెలియజేశారు. ఈ సందర్భంగా

బీసీల కొరకు ఉద్యమిస్తున్న ఎమ్మెల్సీ తీన్మార్ మల్లనకు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో ఘనంగా సన్మానించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసి లు అంతా కలిసి కట్టుగా పోరాడి మన బిసిల అధికార కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో బిసి పొలిటికల్ జె.ఏ.సి సమన్వయకర్త బందారపు నర్సయ్య గౌడ్, బొల్లమోని శంకరయ్య ముదిరాజు, సిలివేరు వెంకటేష్ శాలివాహన,జెట్ట ముత్యాలు కురుమ, గట్టు లింగస్వామి ముదిరాజ్, నక్క శివకుమార ముదిరాజ్,అన్నమోని వెంకటేష్ ముదిరాజ్, బొల్లమోని స్వామి ముదిరాజ్,కందుల పరమేష్ ముదిరాజ్, బొల్లమోని సంపత్ కుమార్ ముదిరాజ్, రాచకొండ పురుషోత్తం చారి,నక్క నాగరాజు ముదిరాజ్ ,పగిళ్ల మల్లేష్ రజక, ముదిరాజ్,ఇతర బిసి కులాల నాయకులు పాల్గొన్నారు .



## బిజెపి నూతన అధ్యక్షుని కలిసిన అడ్వకేట్ లీగల్ సెల్ సభ్యులు.



**యాచారం జులై 2 సి కె న్యూస్** బిజెపి రాష్ట్ర అధ్యక్షునిగా బాధ్యతలు చేపట్టిన సీనియర్ న్యాయవాది మాజి ఎమ్మెల్సీ శవన్ రామచందర్ రావు ను బుధవారం తన తోటి లీగల్ సెల్ సభ్యులతో ఈరోజు కలిసి శుభాకాంక్షలు తెలియచేసిన బిజెపి యాచారం మండల పార్టీ అధ్యక్షులు జరుపుల విజయ్ నాయక్ తో బాటు సభ్యులు పాల్గొన్నారు.

## అధికారుల నిర్లక్ష్యంతో ప్రైవేట్ విద్యాసంస్థలలో పుస్తకాల దందా

● ఎస్ఎఫ్ఐ యాచారం మండల కార్యదర్శి కంబాలపల్లి విప్లవ్ కుమార్




**యాచారం జులై 2 సి కె న్యూస్**

యాచారం మండల కేంద్రంలో ఉన్న పుడమి స్కూల్ పుస్తకాల దందను అరికట్టాలని స్కూలు ముందు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ధర్నా చేయడం జరిగింది.ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ యాచారం మండలం కార్యదర్శి కంబాలపల్లి విప్లవ్ కుమార్ మాట్లాడుతూ పూడమి స్కూల్లో నిబంధనలు విరుద్ధంగా నోట్ పుస్తకాలు,టెక్స్ట్ బుక్స్, యూనిఫాంలు పాఠశాలల్లోనే బైరుగతంగా విక్రయిస్తున్నారని అన్నారు. తల్లిదండ్రుల నుండి ఎమ్మార్పీ రేటు కంటే ఎక్కువ రేటుకు అమ్ముతూ విద్యార్థుల యొక్క తల్లిదండ్రులు మోసం చేస్తున్నారు అని అన్నారు. యాచారం ఎంఈఓ పాండురంగారెడ్డి సార్ కి సమాచారం ఇచ్చిన రాకుండా నిర్లక్ష్యం చేశారు. ప్రవేట్ పాఠశాలలో ఇష్టాసారంగా విద్యార్థుల దగ్గర అధిక ఫీజులు వసూలు చేస్తూ మరోవైపు పుస్తకాల దంద వ్యాపారం చేస్తున్నారు అన్నారు. పలుసార్లు అధికారుల దృష్టికి తీసుకుపోయిన చూసి చూడనట్లు నిమ్మకు నిరెట్టినట్లుగా వివరిస్తున్నారులి ఇక్కడున్న విద్య అధికారి సరైన పద్ధతిలో పరిరక్షణ లేదని అన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బుక్స్ అమ్ముతున్న విద్యాసంస్థల పైన చర్య తీసుకొని గుర్తింపు రద్దు చేయాలని అన్నారు. లేనిపక్షంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షులు అజయ్,రోహిత్ హర్షిత్ వరుణ్ మహేష్ భరత్ తదితరులు పాల్గొన్నారు.

# సింగయ్య మృతిపై అనుమానాలు.. భార్య 'సంచలన' ఆరోపణలు!

వైసీపీ కార్యకర్త సింగయ్య మరణంపై తమకు అనుమానాలు ఉన్నట్లు ఆయన భార్య లూర్దు మేరి తెలిపారు. చిన్న చిన్న గాయాలకే ఆయన మరణించాడని తాము భావించడం లేదని, అంబులెన్స్ లో ఏదో జరిగిందని సందేహం వ్యక్తం చేశారు. పోలీసులు, ప్రభుత్వం నుంచి ఈ కేసుపై తమపై తీవ్ర ఒత్తిడి ఉందని ఆమె ఆరోపించారు. సుమారు 50 మంది లోకేశ్ అనుచరులు తమ ఇంటికి వచ్చి బెదిరించారని, తాము చెప్పినట్లు చెప్పాలని ఒత్తిడి చేశారని ఆమె పేర్కొన్నారు. మేము కూడా మీ కులస్థులమేనంటూ కాగితాలపై ఏదో రాసి తమపై ఒత్తిడి చేసినట్లు సంచలన ఆరోపణలు చేశారు లూర్దా మేరి.గత నెల 18న మాజీ సీఎం జగన్ రెంటపాళ్ల పర్యటన సందర్భంగా ఏటుకూరు బైపాస్ వద్ద జరిగిన ప్రమాదంలో వైసీపీ కార్యకర్త సింగయ్య మరణించిన విషయం తెలిసిందే. ఈ ప్రమాదానికి జగన్ కాన్వాయ్ కాదని ఒకసారి, ఆయన కాన్వాయ్ లోని ప్రైవేటు కారు అంటూ మరోసారి పోలీసులు ప్రకటనలు చేశారు. పర్యటన ముగిసిన రెండు రోజులుకు మాజీ సీఎం జగన్ కారు కిందే సింగయ్య పడిపోయిన దృశ్యాలతో వీడియో విడుదల చేశారు. దీంతో ఈ ఘటనపై అధికార, ప్రతిపక్షాల మధ్య తీవ్రస్థాయిలో మాటల యుద్ధం జరిగింది.సుమారు 15 రోజులపాటు ఈ వివాదం కొనసాగగా, పోలీసులు ప్రమాదానికి కారణమైన జగన్ కారు డ్రైవర్ రమణారెడ్డిపై కేసు నమోదు చేశారు. అంతేకాకుండా ప్రమాద సమయంలో కారులోనే ఉన్న మాజీ సీఎం జగన్ తోపాటు మాజీ మంత్రులు పేర్ని నాని, విడదల రజిని, మాజీ ఎంపీ వైవీ సుబ్బారెడ్డి, జగన్ పీఏ కేఎన్ఆర్ ను కూడా నిందితుల జాబితాలో చేర్చారు. దీనిపై మాజీ సీఎంతో సహా మిగిలిన నిందితులు హైకోర్టును ఆశ్రయించి తదుపరి చర్యలు తీసుకోకుండా ఉపశమనం పొందారు.ఈ పరిస్థితుల్లో సింగయ్య మరణంపై తమకు అనుమానాలు ఉన్నాయని ఆయన భార్య లూర్దామేరి ఆరోపణలు చేయడం సంచలనంగా మారింది. అంతేకాకుండా తమపై టీడీపీ యువనేత లోకేశ్ అనుచరులు ఒత్తిడి చేశారని ఆమె చెబుతున్నారు. తమను మాజీ సీఎం జగన్ మాత్రమే ఆదుకున్నారని ఆమె వ్యాఖ్యానించారు. దీంతో ఈ వివాదం మలుపు తిరిగినట్లు భావిస్తున్నారు.

# లేటెస్ట్ అప్ డేట్.. వంశీ సేఫ్.. ఇక, ఇంటికే!

వైసీపీ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీకి అన్ని వైపుల నుంచి ఊరట లభించింది. నాలుగు కేసులు దాఖలు కాగా.. వాటన్నింటికీ బెయిల్ లభించింది. అయితే.. మూడో కేసులో అంటే.. గన్నవరంలో మైనింగ్ అక్రమాలకు పాల్పడ్డారని నమోదైన కేసులో స్థానిక కోర్టు బెయిల్ ఇచ్చినా.. ప్రభుత్వం మాత్రం దీనిని సుప్రీంకోర్టులో సవాల్ చేసింది. ఈ నేపథ్యంలో తాజాగా విచారణ చేపట్టిన సుప్రీంకోర్టు గతంలో హైకోర్టు ఇచ్చిన బెయిల్‌ను రద్దు చేసేందుకు నిరాకరించింది. అదేవిధంగా ఈ కేసులోనే సీతామహాలక్ష్మి అనే మహిళ కూడా ఇంప్లీడ్ అయ్యారు. తన స్థలాన్ని వంశీ అను చరులు కబ్జా చేశారని ఆమె కేసు పెట్టారు. దీనిపై గన్నవరం పోలీసులు.. కేసు కట్టారు. అయితే.. దీనిని క్రిమినల్ కేసుగా పేర్కొన్నారు. దీనిలోనూ బెయిల్ వచ్చింది. అయితే.. ఈ బెయిల్ను రద్దు చేయాలని కోరుతూ.. సీతామహాలక్ష్మి కూడా సుప్రీంకోర్టును ఆశ్రయించారు. తాజాగా దీనిపైనా విచారణ చేసిన కోర్టు.. అసలు సివిల్ కేసులో పోలీసులకు పనేంటని ప్రశ్నించింది.అంతేకాదు.. సివిల్ కేసును క్రిమినల్ కేసుగా మార్చే ప్రయత్నం చేయడాన్ని తీవ్రంగా ఆక్షేపించింది. ఈ నేపథ్యంలో వంశీ బెయిల్‌ను రద్దు చేయడానికి నిరాకరించింది. ఇలా.. మొత్తంగా అన్ని కేసుల్లోనూ వల్లభ నేనికిబెయిల్ లభించింది. దీంతో ఆయనను బుధవారం జైలు నుంచి పంపించనున్నారు. ఇదిలావుంటే.. గన్నవరంలో సంబరాలు చేసేందుకు కార్యకర్తలు ఏ ర్పాట్లు చేస్తున్నారు. అయితే.. వీటిని పోలీసులు అడ్డుకున్నారు. ఎ లాంటి సంబరాలకు అనుమతులు లేవని పేర్కొన్నారు.

# తెలంగాణలో చంద్రబాబు కోవర్టులు!



తెలంగాణ రాజకీయాలు మరోసారి వాడివేడిగా మారాయి. ముఖ్యంగా జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి చేసిన సంచలన వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయ వర్గాల్లో ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. బనకచర్ల ప్రాజెక్టు విషయంలో ఆయన చేసిన ఆరోపణలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

**చంద్రబాబు కోవర్టుల పాత్రపై ఆరోపణలు**

ప్రాజెక్టుల వెనుక చంద్రబాబు కోవర్టుల పాత్ర ఉందని అనిరుధ్ రెడ్డి తీవ్రంగా ఆరోపించారు. "బనకచర్ల విషయంలో ఒక ఎమ్మెల్యేగా నేను ఓ సూచన చేస్తున్నాను. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్న లెటర్లు రాసుడు కాదు. అసలు విషయం ఏమిటంటే.. చంద్రబాబు కోవర్టులు తెలంగాణలో ఉన్నారు. వారే ఇరిగేషన్ ప్రాజెక్టులు, రోడ్డు కాంట్రాక్టులు చూస్తున్నారు" అంటూ మండిపడ్డారు.

ఈ కోవర్టులకు కరెంట్ కనెక్షన్, నీటి కనెక్షన్ కట్ చేయాలని, ఇరిగేషన్ ప్రాజెక్టులకు ఒక్క రూపాయి కూడా ఇవ్వకూడదని ఆయన సూచించారు. "వాళ్లే చంద్రబాబుని కలిసి బనకచర్ల ప్రాజెక్టు పై స్టే తెప్పిస్తారు. మంచిగా మాట్లాడితే ఆంధ్రవాళ్లు వినరు" అని తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు.

**రాజకీయ దుమారం, భిన్నాభిప్రాయాలు**

ఇటీవలి కాలంలో తెలంగాణలో పాలన, ప్రాజెక్టుల అమలులో అనేక ఇబ్బందులు ఎదురవుతున్న నేపథ్యంలో అనిరుధ్ రెడ్డి చేసిన ఈ వ్యాఖ్యలు వివాదానికి దారితీసే అవకాశం ఉంది. గతంలో కూడా రాష్ట్రానికి సంబంధించిన ప్రాజెక్టులపై రాజకీయ ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో, తాజా వ్యాఖ్యలు కొత్త దుమారాన్ని రేపుతున్నాయి. ఈ వ్యాఖ్యలు ఇప్పటికే సోషల్ మీడియా వేదికగా విస్తృతంగా పంచుకోబడుతూ భిన్నాభిప్రాయాలకు తావిస్తున్నాయి. తెలంగాణ-ఆంధ్ర సంబంధాల విషయంలో మరోసారి ఉత్కంఠ పరిస్థితులు నెలకొనవచ్చన్న అభిప్రాయం రాజకీయ విశ్లేషకులలో వ్యక్తమవుతోంది.

**ప్రభుత్వ స్పందనపై డిమాండ్లు**

మొత్తానికి ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు అధికారిక స్థాయిలోనూ, విపక్షాల స్థాయిలోనూ స్పందన కోరుకుంటున్నాయి. ఈ వ్యవహారంపై ప్రభుత్వం ప్రగతివంతమైన క్లారిటీ ఇవ్వాలన్న డిమాండ్లు కూడా వినిపిస్తున్నాయి. ఈ వ్యాఖ్యలు తెలంగాణ రాజకీయాల్లో ఎలాంటి మలుపు తిరుగుతాయో చూడాలి.

# 2029 ఎన్నికలు : సీబీఎన్ Vs జగన్.. AI చెబుతుంది ఇదే..





ఏపీలో ఎన్నికలు ముగిసి ఏడాది మాత్రమే అయింది. ఎన్నికలకు ఇంకా నాలుగేళ్ల సమయం ఉంది. అయితే జమిలి ఎన్నికల ప్రచారంతో ఎన్నికలు ముందుగా జరిగే అవకాశాలు ఉన్నాయని ప్రతిపక్ష నేత, మాజీ సీఎం జగన్ అంచనా వేస్తున్నారు. గత ఎన్నికల్లో ఘోరంగా ఓడిపోయిన ఆయన తన ఓటమికి ఈవీఎం గోల్ మాల్ అంటూ ఆరోపిస్తున్నారు. సుమారు 40 శాతం ఓటు బ్యాంకు ఉన్న వైసీపీకి కేవలం 11 సీట్లు రావడంపై జగన్, ఆయన పార్టీ నేతలు ఇప్పటికీ అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఇదే సమయంలో 2029 ఎన్నికల్లో మళ్లీ గెలిచి అధికారం చేపట్టాలని ఇప్పటి నుంచే ప్రణాళిక రచిస్తున్నారు. ఆ దిశగా అడుగులు వేస్తున్నారు. మరోవైపు అధికార కూటమి కూడా ప్రతిపక్షానికి 11 సీట్లు మాత్రమే వచ్చాయని అజాగ్రత్తగా ఉండొద్దని తన ఎమ్మెల్యేలను నిరంతరం అప్రమత్తం చేస్తూనే ఉంది. వచ్చే ఎన్నికలలో వరుసగా గెలిచి అధికారాన్ని సుస్థిరం చేసుకునేలా వ్యూహాలు రచిస్తోంది. ఇటీవల సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం, ఆ తర్వాత టీడీపీ ఎమ్మెల్యేల సమావేశం నిర్వహించిన ముఖ్యమంత్రి చంద్రబాబు టార్గెట్ 2029పై విస్పష్ట సంకేతాలు పంపారు. ఈ నేపథ్యంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా వచ్చే ఎన్నికల నాటికి ముఖ్యమంత్రి చంద్రబాబు, మాజీ ముఖ్యమంత్రి జగన్ మధ్య పోటీ ఎలా ఉంటుందన్న ప్రశ్నకు ఆసక్తికర విశ్లేషణ తెలియజేసింది. 2024 ఎన్నికల్లో మూడు పార్టీల కూటమి ద్వారా సుమారు 55 శాతం ఓటు బ్యాంకు సాధించి ఘన విజయం సాధించింది. ఇందులో టీడీపీకి సొంతంగా 45.6 శాతం ఓటు షేరు సాధించింది. ఈ ప్రజామద్దతు నిలుపుకుని 2029 ఎన్నికలకు వెళ్లాలని ముఖ్యమంత్రి చంద్రబాబు భావిస్తున్నారని ఏఐ తెలియజేసింది. అంతేకాకుండా తమ అధికారాన్ని నిలుపుకునేందుకు మూడు పార్టీల కూటమి బలంగా ఉండాలని కోరుకుంటున్నారని, డబుల్ ఇంజిన్ సర్కారుతో అభివృద్ధి సాధిస్తున్నామని ప్రచారం చేస్తున్నారని తెలిపింది. ముఖ్యంగా కేంద్రీకృత అభివృద్ధి అజెండాతోనే ముఖ్యమంత్రి పనిచేస్తున్నారని ఏఐ విశ్లేషించింది. అదేసమయంలో ప్రతిపక్ష నేత జగన్ ఎస్సీ, ఎస్టీలతోపాటు తనకు ఉన్న 40 శాతం ఓటు బ్యాంకును నిలుపుకుని ఇతర వర్గాలను ఆకట్టుకునేలా ప్రణాళిక బద్ధంగా నడుస్తున్నారని ఏఐ తెలిపింది. 2029 ఎన్నికల్లో కచ్చితంగా గెలుస్తానన్న నమ్మకంతో ఉన్న జగన్ ముందుగా పార్టీ యంత్రాంగాన్ని బలోపేతం చేసేలా అడుగులు వేస్తున్నారని అంచనా వేసింది. ఇక ఇరువురు నేతల బలాబలాలు, బలహీనతలపైనా ఏఐ ఆసక్తికర విశ్లేషణ తెలియజేసింది. 2024 ఎన్నికల తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబు పాలనపై కొంత వ్యతిరేకత కనిపిస్తున్నా పట్టణ మధ్య తరగతి, అగ్రవర్ణాలు, ఓబీసీల మద్దతు చెక్కుచెదరలేదని అంచనా వేసింది. అదేవిధంగా కూటమి పాలన ద్వారా మౌలిక సదుపాయాలు కల్పన, సంక్షేమ పథకాలు ద్వారా గ్రామీణ పేదలు, ఎస్సీ, ఎస్టీలను మచ్చిక చేసుకునే ప్రయత్నాలు చేస్తున్నారని చెప్పింది. కూటమి భాగస్వామ్య పక్షాలు బీజేపీ, జనసేనతో సమన్వయం కొనసాగించడం కూడా ముఖ్యమంత్రి చంద్రబాబును బలానికి కారణంగా చెబుతోంది. అదే సమయంలో వైసీపీలో జగన్ నాయకత్వంపై కేడర్ కు పూర్తి విశ్వాసం ఉండటం ఆయనకు బలం చేకూర్చుతోందని ఏఐ విశ్లేషించింది. అభివృద్ధి, పెట్టుబడుల సాధన, కొత్త ఉద్యోగాల సృష్టి వంటి అంశాలను ఎన్నికల ప్రచార అస్త్రాలుగా ముఖ్యమంత్రి చంద్రబాబు వాడుకునే అవకాశాలు ఉన్నాయని చెబుతున్న ఏఐ .. అదే విషయంలో జగన్ మాత్రం తనకు ఉన్న గ్రామీణ మద్దతుదారులు,

ఎస్సీ, ఎస్టీ ఓటు బ్యాంకుపైనే ఎక్కువ నమ్మకం పెట్టుకున్నారని తెలిపింది. అదేవిధంగా టీడీపీ పట్టణ పార్టీగా.. వైసీపీ గ్రామీణ పార్టీగా అభివర్ణించింది. మంచి వాగ్దాటి, గ్యారెంటీ హామీల అమలు, భాగస్వామ్య పక్షాలతో సంయుక్త పోరాటంతో ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికలకు ఇప్పటి నుంచే సిద్ధమవుతుండగా, జగన్ గ్రామ స్థాయి నుంచి పార్టీని పునః నిర్మించుకోడానికి జిల్లాల పర్యటనలు, పాదయాత్ర వంటి కార్యక్రమాలతో పార్టీని 2029 ఎన్నికలకు సిద్ధం చేయాలని చూస్తున్నారని ఏఐ విశ్లేషించింది.

# నిన్న 'మే డే' కాల్, నేడు 'డోంట్ సింక్' అలర్ట్... ఇది ఎందుకో తెలుసా?



జూన్ 12న అహ్మదాబాద్ లో జరిగిన ఘోర విమాన ప్రమాదం జరిగిన సంగతి తెలిసిందే. ఈ ప్రమాదంతో ప్రపంచం మొత్తం ఒక్కసారిగా తీవ్ర దిగ్భ్రాంతికి గురైంది. ఈ ప్రమాదంలో విమానంలో ప్రయాణిస్తున్న వారు 241 మంది, బయట పౌరులు 19 మంది మరణించారు. ఆ విమానం ప్రమాదానికి గురయ్యే సెకన్ల ముందు పైలెట్ల నుంచి ఏటీసీకి "మే డే" కాల్ వచ్చిన సంగతి తెలిసిందే.దీంతో... ఏమిటీ మే డే కాల్ అనే చర్చ జరిగిన సంగతి తెలిసిందే. ఇది విమానంలో సమస్య ఎదురైనప్పుడు పైలెట్ల నుంచి ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ కు వచ్చే కాల్. అయితే... ఆ ప్రమాదం జరిగిన 38 గంటల్లోనే మరో ఎయిరిండియా విమానం టెన్షన్ పెట్టింది. ఇందులో భాగంగా... జూన్ 14 తెల్లవారుజామున ఢిల్లీ నుండి బయలుదేరి వియన్నాకు వెళ్తున్న బోయింగ్ 777 విమానం స్టాల్ హెచ్చరికను అందుకుంది.అవును... జూన్ 14 తెల్లవారుజామున ఢిల్లీ నుండి బయలుదేరి వియన్నా విమానం ఒక్కసారిగా 900 అడుగుల మేర కిందికి దిగిపోయింది. దీంతో... విమానంలోని ప్రయాణికులు ఒక్కసారిగా ఆందోళన చెందారు. ఆ సమయంలో... గ్రౌండ్ ప్రాక్సిమిటీ వార్నింగ్ సిస్టమ్స్ (జీ.పీ.డబ్ల్యూ.ఎస్) నుంచి వార్నింగ్ సిగ్నల్ వెలువడింది.. అదే... "డోంట్ సింక్"! ఆ అలర్ట్ ఏమిటనేది ఇప్పుడు చూద్దామ్..!విమానం ల్యాండింగ్ సమయంలో లేదా భూమికి దగ్గరగా ఉన్నప్పుడల్లా మోడ్ – 1 హెచ్చరిస్తుంది. ఈ క్రమంలో వెలువడే ప్రారంభ హెచ్చరిక "సింక్ రేట్" (విమానం ఎత్తును కోల్పోయే రేటు) కాగా... విమానం పర్వతం పైకి లేదా నిటారుగా ఉన్న ప్రదేశాల మీదుగా ఎగురుతుంటే, అప్పుడు గ్రౌండ్ క్లియరెన్స్ వేగంగా తగ్గుతుంటే.. మోడ్ – 2 "పుల్ అప్" అని హెచ్చరిక జారీ అవుతుంది.ఇక... టేకాఫ్ తర్వాత పైలట్ లు సానుకూల ఆరోహణ రేటును నిర్వహించడానికి మోడ్ – 3 సహాయ పడుతుంది. ఇందులో భాగంగా... విమానం 1,000 అడుగులకు చేరుకున్న తర్వాత.. ఒక్కసారిగా ఎత్తు దిగడం ప్రారంభిస్తే సిస్టమ్ "డోంట్ సింక్" అనే హెచ్చరికను వినిపిస్తుంది. అదేవిధంగా... ల్యాండింగ్ గేర్ లేదా ఫ్లాప్ లు ల్యాండింగ్ కోసం సరిగ్గా కాన్ఫిగర్ చేయకపోతే మోడ్ – 4 హెచ్చరిస్తుంది.అంటే... విమానం చాలా వేగంగా కిందకు దిగుతున్నప్పుడు, ముఖ్యంగా భూమిని సమీపిస్తున్నప్పుడు లేదా భూమికి దగ్గరగా ఉన్నప్పుడు గ్రౌండ్ ప్రాక్సిమిటీ వార్నింగ్ సిస్టమ్ (జీ.పీ.డబ్ల్యూ.ఎస్) ద్వారా "డోంట్ సింక్" (మునిగిపోవద్దు) హెచ్చరికలు జారీ చేయబడతాయి. ఈ హెచ్చరికలు పైలట్ లకు ప్రమాదకరమైన పరిస్థితులను నివారించడానికి సహాయపడతాయి.కాగా... అత్యవసర ప్రమాద పరిస్థితిని ఎదుర్కొంటున్నామనే విషయాన్ని రేడియో కమ్యునికేషన్ ద్వారా సమీపంలోని ఏటీసీ కి తెలియజేయడానికి చేసేదాన్ని మేడే కాల్ అంటారనే సంగతి తెలిసిందే. అంటే... తాము ఆపదలో ఉన్నామని, తక్షణమే సాయం కావాలని విజ్ఞప్తి చేయడం అన్నమాట. ఎమర్జెన్సీ సమయాల్లో పైలెట్లు 'మేడే' అనే పదాన్ని మూడు సార్లు చెబుతారు!

# జగన్ నెల్లూరు పర్యటన రద్దు.. కారణం అదేనా?



": మాజీ సీఎం వైఎస్ జగన్మోహనరెడ్డి నెల్లూరు జిల్లా పర్యటన తాత్కాలికంగా వాయిదా వేసుకున్నారు. 3వ తేదీ గురువారం జగన్ నెల్లూరు పర్యటనకు ముందుగా షెడ్యూల్ ఖరారైంది. ఈ పర్యటనలో భాగంగా ఆయన అక్రమ మైనింగు కేసులో అరెస్టు అయిన మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డిని పరామర్శించాలని భావించారు. అయితే హెలీపాడ్ ఎంపిక విషయంలో వైసీపీ, పోలీసులకు మధ్య ఏకాభిప్రాయం కుదరకపోవడంతో జగన్ పర్యటన వాయిదా వేసుకున్నారు.

నెల్లూరు సెంట్రల్ జైలులో రిమాండులో ఉన్న మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డితో ములాఖత్ అయ్యేందుకు జగన్ అనుమతి కోరారు. దీనికోసం జైలుకు సుమారు పది కిలోమీటర్ల దూరంలో హెలిపాడ్ ఏర్పాటుకు అక్కడి నుంచి ర్యాలీగా జైలుకు వచ్చేందుకు వైసీపీ నేతలు అనుమతి కోరారు. అయితే వైసీపీ వినతిని పరిశీలించిన పోలీసులు జగన్ వచ్చే హెలికాప్టర్ కోసం సెంట్రల్ జైలు సమీపంలో హెలిపాడ్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

అయితే అక్కడ హెలిపాడ్ ఏర్పాటు చేయడం వల్ల జగన్ ప్రజలను కలిసే అవకాశం ఉండదని భావించిన వైసీపీ పోలీసుల ప్రతిపాదనను తిరస్కరించింది. అంతేకాకుండా హైటెన్షన్ విద్యుత్ వైర్లు ఉన్నాయని, తుప్పలు ఎక్కువగా ఉండటం, రోడ్డు వసతి లేకపోవడంతో పోలీసులు సూచించిన చోట హెలిపాడ్ నిర్మాణం సాధ్యం కాదని వైసీపీ చెబుతోంది. దీనిపై కోర్టుకు వెళ్లే ఆలోచన చేస్తోంది. జగన్ పర్యటనను అడ్డుకునేందుకు ప్రభుత్వం పోలీసుల ద్వారా ప్రయత్నాలు చేస్తోందని వైసీపీ ఆరోపిస్తోంది.

తాము అధికారంలో ఉండగా, చంద్రబాబు, పవన్ కల్యాణ్ పర్యటనలు అడ్డుకున్నామా? అంటూ ప్రశ్నిస్తోంది. అయితే గత నెల 18న జగన్ పల్నాడు పర్యటనకు వెళ్లిన సమయంలో ముగ్గురు మరణించిన విషయం తెలిసిందే. ఈ ఘటనలను దృష్టిలో పెట్టుకుని జగన్ పర్యటన ప్రశాంతంగా ముగిసేలా జైలుకు సమీపంలోనే హెలిపాడ్ ఏర్పాటు చేసుకోవాలని సూచించినట్లు పోలీసులు చెబుతున్నారు. దీంతో జగన్ నెల్లూరు పర్యటన మరోమారు అధికార, విపక్షాల మధ్య వాడివేడి మాటల యుద్ధానికి తెరలేపింది.

CK NEWS చంద్రకాంత్ తెలుగు దినపత్రిక

# బ్రేక్ తాత్కాలికమేనా?

బనకచర్ల ప్రాజెక్టుకు బ్రేకులు పడ్డాయి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పంపిన ప్రతిపాదనలను కేంద్రం తిరస్కరించింది. బనకచర్లకు అనుమతి ఇవ్వలేమని కేంద్ర ప్రభుత్వం తేల్చి చెప్పింది. బనకచర్లకు పర్యావరణ అనుమతులు తిరస్కరించిన కేంద్రం ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ సర్కార్ పంపిన ప్రతిపాదనలను వెనక్కు తిప్పి పంపింది. అయితే ఇది తాత్కాలిక బ్రేకులా? లేక శాశ్వతంగా అనుమతులు ఇవ్వరా? అన్నది తేలాల్సి ఉంది. కానీ రాజకీయ ప్రయోజనాల దృష్ట్యానే బనకచర్లకు అనుమతులు ఇవ్వకోవడానికి ప్రధాన కారణంగా తెలుస్తుంది. అందుకే ఏపీ ప్రభుత్వానికి చెందిన నేతలు మాత్రం ఇది తాత్కాలిక బ్రేకులేనని, ఖచ్చితంగా బనకచర్ల ప్రాజెక్టులు పూర్తి చేస్తామని చెబుతున్నారు.

**గేమ్ ఛేంజర్ గా భావించి...**

బనకచర్ల ప్రాజెక్టును చంద్రబాబు నాయుడు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. దీనిని గేమ్ ఛేంజర్ గా చంద్రబాబు అభివర్ణించారు. గోదావరిలో వృధాగా తరలిపోయే నీటిని పోలవరం ప్రాజెక్టు ద్వారా కాల్వల ద్వారా రాయలసీమతో పాటు కోస్తాంధ్రలోని అన్ని జిల్లాలకు మళ్లించాలన్నది చంద్రబాబు ఆలోచన. ఈ ప్రాజెక్టు పూర్తయితే రాయలసీమ రతనాల సీమగా మారుతుందని చంద్రబాబు నాయుడు పదే పదే చెబుతున్నారు. పోలవరం – బనకచర్ల లింక్ ప్రాజెక్టు కోసం ఎనభైవేల కోట్ల రూపాయలు ఖర్చవుతుందని అంచనా వేశార. కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ బీజేపీ, టీడీపీ కలసి ఉండటంతో సులువుగా అనుమతులు సాధించవచ్చని భావించి ఈ ప్రాజెక్టుకు సంబంధించి డీపీఆర్ ను సిద్ధం చేసి కేంద్ర ప్రభుత్వానికి సమర్పించారు.

**రాజకీయంగా అగ్గి రాజుకోవడంతో...**

అయితే బనకచర్ల ప్రాజెక్టుతో తెలంగాణలో రాజకీయంగా అగ్గి రాజుకుంది. తమకు న్యాయంగా దక్కాల్సిన గోదావరి నీటిని అక్రమంగా ఏపీ ప్రభుత్వం తరలించుకుపోతుందని తెలంగాణలోని అన్ని పార్టీలు ఆందోళనకు దిగాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీకి వెళ్లి కేంద్ర మంత్రులను కలసి వచ్చారు. మరొకవైపు తెలంగాణ బీజేపీ నేతలు కూడా పార్టీ నాయకత్వంపై వత్తిడి తెచ్చారు. బనకచర్లకు అనుమతులు మంజూరు చేస్తే ఆ ప్రభావం తెలంగాణ రాజకీయాల్లో పడే అవకాశముందని పార్టీ పెద్దలకు నచ్చచెప్పడంలో సక్సెస్ అయ్యారు. అందుకే పర్యావరణ అనుమతులు ఇవ్వలేమంటూ కేంద్ర, అటవీ పర్యావరణ మంత్రిత్వ శాఖ పరిధిలోని నిపుణుల కమిటీ తేల్చి చెప్పింది.

**అభ్యంతరాలు వ్యక్తం కావడంతో...**

తెలంగాణ నుంచి అనేక అభ్యంతరాలు ప్రాజెక్టుపై వ్యక్తమయ్యాయి. నీటి కేటాయింపులకు విరుద్ధమంటూ ఢిల్లీ స్థాయిలోనూ, రాష్ట్ర స్థాయిలోనూ గళమెత్తారు. వరద జలాలపై సమగ్ర అధ్యయనం చేయాలంటూ డిమాండ్ చేశారు. అందుకే ముందుగా అంతరాష్ట్ర అనుమతులు ప్రాజెక్టుకు పొందాలని కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ స్పష్టం చేసింది. దీంతో పాటు ఇప్పుడున్న పరిస్థితుల్లో నిధుల కేటాయింపు కూడా కష్టసాధ్యమవుతుందని భావించిన కేంద్ర ప్రభుత్వం ఎన్నికలు పూర్తయి తిరిగి అధికారంలోకి వచ్చిన తర్వాత మాత్రమే దీనిపై పునరాలోచించే వీలుందని హస్తిన వర్గాలు చెబుతున్నాయి. బనకచర్ల ప్రాజెక్టుకు అనుమతిస్తే తెలంగాణలో రాజకీయంగా ఎదురుదెబ్బ తగులుతుందని భావించి బ్రేకులు వేసిందన్నది వాస్తవం.

# 'చక్కని గుండె' కోసం అమెరికా హార్ట్ అసోసియేషన్ సూచిస్తున్న ఆహారం

## గుండె జబ్బుల విషయంలో ఆహారం కీలక పాత్ర
## కొన్ని రకాల ఆహారంతో రక్తపోటు, కొలెస్ట్రాల్ ముప్పు
## నాలుగు రకాల డైట్ నమూనాలను వెల్లడించిన యూఎస్ సంస్థ



తీసుకునే ఆహారం, జీవనశైలి గుండెపై ఎంతో ప్రభావం చూపిస్తాయి. నేడు గుండె జబ్బులు పెరిగిపోవడానికి ఆహారం విషయంలో సరైన నియమాలు పాటించకపోవడం ప్రధాన కారణం కాగా, సరైన నిద్ర లేకుండా, శారీరక వ్యాయామం లేని జీవన విధానం కూడా ప్రభావం చూపిస్తోంది. మరి ఈ క్రమంలో గుండెకు హాని చేయని ఆహారం ఏది? అన్న సందేహం ఎక్కువ మందికి వస్తుంటుంది. ఎందుకంటే ఆహారం విషయంలో ఒక్కొక్కరు ఒక్కో రకంగా చెబుతుండడంతో పెద్ద అయోమయం నెలకొంది. అందుకే అమెరికన్ హార్ట్ అసోసియేషన్ గుండె జబ్బుల రిస్క్ ను తగ్గించే పలు రకాల డైట్ వివరాలను విడుదల చేసింది.

**ఆహారం పాత్ర**

గుండె జబ్బుల విషయంలో ఆహారం పాత్ర కచ్చితంగా ఉంటుంది. మనం తీసుకునే ఆహారం రక్తపోటు నియంత్రణపై ప్రభావం చూపిస్తుంది. రక్తంలో కొలెస్ట్రాల్ ను పెంచుతుంది. ఈ రెండూ గుండె జబ్బులకు కారణమయ్యే పెద్ద సమస్యలు. కనుక రక్తపోటు, కొలెస్ట్రాల్ ను పెంచని ఆహారానికి ప్రాధాన్యం ఇవ్వాలి.

**డాష్ డైట్**

డాష్ అంటే.. డైటరీ అప్రోచెస్ టు స్టాప్ హైపర్ టెన్షన్. రక్తపోటును నియంత్రణలో ఉంచేందుకు రూపొందించిన ఆహార నమూనా ఇది. ఉప్పు తక్కువగా ఉన్న ఆహారం తీసుకోవాలి. పండ్లు, కూరగాయలు, తృణ ధాన్యాలను తీసుకోవాలి. పాల ఉత్పత్తులు తీసుకోవచ్చు కానీ తక్కువ ఫ్యాట్ ఉండేవి ఎంపిక చేసుకోవాలి. లీన్ ప్రొటీన్ తీసుకోవాలి.

**పెస్కాటేరియన్ డైట్**

ఇది శాకాహారం. పండ్లు, కూరగాయలు, నట్స్, సీడ్స్, తృణ ధాన్యాలు, డైరీ ఉత్పత్తులను ఈ ఆహారంలో భాగంగా తీసుకోవచ్చు. మీట్, చికెన్ కు దూరంగా ఉండాలి. కావాలంటే చేపలను తీసుకోవచ్చు.

**మెడిటెర్రానియన్ డైట్**

ఇది మంచి సమతులాహారం. ఆరోగ్యకరమైన ఆహారంగా దీనికి గుర్తింపు కూడా లభించింది. మొక్కల ఆధారిత ఆహారం ఇది. తృణ ధాన్యాలు, కూరగాయలు, పండ్లు, నట్స్, మూలికలు, దినుసులు, పప్పు ధాన్యాలను ఇందులో భాగంగా తీసుకోవాలి. యుగర్ట్, చీజ్, చికెన్, గుడ్లను పరిమితంగా తీసుకోవచ్చు.

**లాక్టో ఓవో వెజిటేరియన్ డైట్**

మొక్కల ఆధారిత ఆహారానికితోడు డైరీ ఉత్పత్తులు, గుడ్లను ఇందులో తీసుకోవచ్చు. గుడ్లు మినహా చికెన్, చేపలు, మీట్ ను కూడా తీసుకోకూడదు.

# డయాబెటిస్ ఉన్న వారు పుచ్చకాయ తినొచ్చా..?

## పుచ్చకాయలో గ్లైసిమిక్ ఇండెక్స్ కొంచెం ఎక్కువే
## అయినా 92 శాతం నీరు, మిగిలినది ఫైబర్
## విటమిన్లు, యాంటీ ఆక్సిడెంట్లు ఎక్కువ, కేలరీలు తక్కువ
## మోస్తరుగా తీసుకుంటే ఆరోగ్య ప్రయోజనాలు





వేసవిలో ఎక్కువ మంది ఇష్టంగా తినే పండ్లలో పుచ్చకాయ కూడా (వాటర్ మెలాన్) ఒకటి. రుచితో పాటు అధిక శాతం నీరు ఉండే పుచ్చకాయ పోషకాల నిలయం. పుచ్చకాయలో సహజ చక్కెర పరిమాణం అధికంగా ఉంటుంది. దీంతో దీన్ని డయాబెటిస్ సమస్యతో బాధపడుతున్న వారు తినొచ్చా? అన్న సందేహం వస్తుంటుంది. దీనికి నిపుణులు పరిమితంగా తినొచ్చని సూచిస్తున్నారు. వాటర్ మెలాన్ లో కేలరీలు తక్కువగా ఉంటాయి. విటమిన్ ఏ, సీ, ఫైబర్ ఉండడం అనుకూలం. లైకోపీన్ అనే యాంటీ ఆక్సిడెంట్ కూడా లభిస్తుంది. ఇది కేన్సర్, గుండె జబ్బుల నుంచి రక్షణనిచ్చే యాంటీ ఆక్సిడెంట్. పుచ్చకాయలో 92 శాతం నీరే ఉంటుంది. మిగిలినది ఫైబర్. కనుక పండ్లలో ఇదొక మంచి ఎంపిక అవుతుంది. అధిక నీటి పరిమాణం వల్ల వేసవిలో శరీరంలో తగినంత నీటి పరిమాణం ఉండేందుకు ఈ పండు అనుకూలిస్తుంది. ఇందులో ఫొలేట్, పొటాషియం, ఫైటో కెమికల్స్, మినరల్స్ కూడా ఉంటాయి.

వాటర్ మెలాన్ గ్లైసిమిక్ ఇండెక్స్ 72. ప్రతీ పదార్థానికీ గ్లైసిమిక్ ఇండెక్స్ ఉంటుంది. అంటే తిన్న తర్వాత ఎంత వేగంగా గ్లూకోజ్ గా మారిపోతుందన్నది ఈ ఇండెక్స్ చెబుతుంది. జీఐ 72 అంటే మోస్తరు నుంచి అధికం అని అర్థం. మధుమేహులు జీఐ తక్కువగా ఉన్నవి తీసుకుంటే మంచిది. మరి పుచ్చకాయలో జీఐ కొంచెం ఎక్కువగా ఉన్నందున తీసుకోవచ్చా? అన్న సందేహం తప్పకుండా వస్తుంది. కాకపోతే పుచ్చకాయలో 92 శాతం నీరు, మిగిలినది ఫైబర్ అవ్వడం వల్ల, తిన్న వెంటనే అది గ్లూకోజ్ గా మారిపోదు. ఫైబర్ ఉండడం వల్ల నిదానంగానే రక్తంలోకి విడుదల అవుతుంది. అందుకని పరిమితంగా తీసుకోవడం మధుమేహులకూ మంచిదే.

# కాజల్ కెరీర్ ముగిసినట్లేనా?



నేహా మాలిక్ కేన్స్ 2025 రెడ్ కార్పెట్ వస్త్రధారణ



హీరోయిన్ గా కాజల్ అగర్వాల్ సినిమా రిలీజ్ అయి రెండేళ్లు అవుతుంది. నటసింహ బాలకృష్ణ హీరోగా నటించిన 'భగవంత్ కేసరి'లో బాలయ్యకు జోడీగా నటించింది. ఆ సినిమా మంచి విజయం సాధించింది. కానీ ఆ తర్వాత కాజల్ హీరోయిన్ గా కనిపించింది లేదు. రజనీకాంత్ నటించిన 'ఇండియన్ 2'లో నటించింది. కానీ అనూహ్యంగా ఆ పాత్రను 'ఇండియన్ 3' కి మళ్లించారు. ఈ సినిమా ఎప్పుడు రిలీజ్ అవుతుందో తెలియదు? ఈ సినిమాపై ఎలాంటి అంచనాలు కూడా లేవు. బాలీవుడ్ లో 'సికిందర్' కాజల్ పాత్ర పేరుకే పరిమితమైంది. పాన్ ఇండియా చిత్రం 'కన్నప్ప'లో గెస్ట్ రోల్ పోషిస్తుంది.


'ది ఇండియా స్టోరీ' అనే హిందీ చిత్రం చేస్తోంది. దీంతో పాటు 'రామయణ్' లోనూ ఓ కీలక పాత్ర పోషిస్తుంది. హీరోయిన్ గా పరిచయమై కాజల్ ఇప్పుడు అతిధి పాత్రలకు..సెకెండ్ లీడ్ కు పరిమి తమవుతుంది.దీంతో కాజల్ కెరీర్ ముగిసినట్లేనా? అన్న ప్రచారం నెట్టింట మొదలైంది. అమ్మడికి ఇక హీరోయిన్ అవకాశాలు దాదాపు దూరమైనట్లే అంటున్నారు. తెలుగులో సీనియర్ హీరోలతో కూడా ఇప్పటికే పనిచేసింది. మళ్లీ వాళ్ల సరసన ఎంపిక చేయడం కూడా కష్టమే. లేదంటే? త్రిషలా బండి లాగించేది. కానీ ఇప్పుడున్న పోటీలో త్రిష లా ఛాన్సులందుకోవడం మాత్రం కాజల్ కి కష్టమనే మాట వినిపిస్తుంది.

టాలీవుడ్ లో ఇప్పుడు సౌత్ భామలదే హవా. ముంబై, ఢిల్లీ మోడల్స్ కంటే నేచురల్ పెర్ఫార్మర్లకే టాలీవుడ్ ప్రాధాన్యత ఇస్తుంది. ఐదేళ్లగా చెన్నై, కర్ణాటక, కేరళ నుంచి ఎక్కువగా హీరోయిన్లు దిగుమతి అవుతు న్నారు. ఉత్తరాది రాష్ట్రాల నుంచి చాలా తక్కువ మందిని తీసుకుంటున్నారు. ఈ క్రమంలో కాజల్ కి అవకాశాలు మరింత జఠిలంగా మారతాయని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.



నభా నటేష్ అందం, స్టైల్ మరియు మనోజ్ఞతను కొల్లగొట్టింది

## ఆఖరి అవకాశం.. డిస్కషన్ పాయింట్ అయ్యిందిగా..?



హీరోయిన్ గా ఛాన్స్ రావడం ఎలాగోలా వస్తుంది కానీ అలా వచ్చిన అవకాశాన్ని సద్వినియోగపరచుకుని స్టార్ గా ఎదగడం అన్నది మాత్రం అంత ఈజీ థింగ్ కాదు. ప్రతి శుక్రవారం పదుల కొద్దీ సినిమాలు రిలీజ్ అవుతాయి కానీ ఆడియన్స్ కి రీచ్ అయ్యే కథానాయికలు మాత్రం చాలా తక్కువ మంది ఉంటారు. అలాంటి వాళ్ల లిస్ట్ లో ప్లేస్ దక్కించుకోవాలని ప్రతి హీరోయిన్ ట్రై చేస్తుంది. ఐతే ఇదే చివరి అవకాశం అనుకున్న వారికి కాస్త పాజిటివ్ వైబ్ వస్తే తిరిగి జోష్ వచ్చేస్తుంది.

ప్రస్తుతం రొమాంటిక్ బ్యూటీ కెతిక శర్మ అలాంటి జోష్ లోనే ఉంది. ఆకాష్ పూరీతో చేసిన రొమాంటిక్ తో తెలుగు తెరకు పరిచయమైన కెతిక శర్మ అప్పటి నుంచి వరుస సినిమాలు చేస్తుంది కానీ ఆమె క్రేజ్ దక్కించుకోలేకపోయింది. ఈమధ్యనే నితిన్ రాబిన్ హుడ్ లో అది దా సర్ ప్రైజ్ సాంగ్ తో అలరించింది కానీ సినిమా ఫ్లాప్ అవ్వడంతో ఆమెను పట్టించుకోలేదు.ఐతే ఫైనల్ గా శ్రీవిష్ణుతో సింగిల్ సినిమా చేసి సక్సెస్ అందుకుంది కెతిక శర్మ. నిజం చెప్పాలంటే అమ్మడి ఖాతాలో స్ట్రైట్ హిట్ అంటే ఈ సినిమానే. అందుకే సింగిల్ సక్సెస్ ని అమ్మడు చాలా ఎంజాయ్ చేస్తుంది. అంతేకాదు కెరీర్ లో ఆఖరి అవకాశం అనుకున్న సింగిల్ తో సక్సెస్ కొట్టడంతో అమ్మడికి మరికొన్ని అవకాశాలు వచ్చేలా ఉన్నాయి. గీతా ఆర్ట్స్ లో సినిమా హిట్ కొట్టింది కాబట్టి ఆ బ్యానర్ లో చేసే సినిమాలకు ఆమెను పరిగణలోకి తీసుకుంటారని చెప్పొచ్చు.

ఏది ఏమైనా కెతిక శర్మకు ఇన్నాళ్లకు ఒక సక్సెస్ వచ్చింది. ఇదే ఊపుతో అమ్మడు వరుస సినిమాలు చేసి మరిన్ని హిట్లు అందుకోవాలని తెలుగు ఆడియన్స్ కోరుతున్నారు. కెతిక లాంటి భామకి సరైన హిట్లు పడితే కచ్చితంగా అమ్మడు మరింత రెచ్చిపోయే ఛాన్స్ ఉంటుందని చెప్పొచ్చు. సింగిల్ తో కెరీర్ లో మళ్లీ కొత్త ఉత్సాహాన్ని ఏర్పరచుకున్న కెతిక ఇదే ఫాం కొనసాగించాలని ఆశిద్దాం. మరి రాబోతున్న సినిమాలు అమ్మడికి ఎలాంటి ఫలితాన్ని అందిస్తాయన్నది చూడాలి. హిట్టు పడింది కాబట్టి కథల విషయంలో కాస్త జాగ్రత్త వహిస్తే కెతిక కొన్నాళ్లు టాలీవుడ్ లో మంచి అవకాశాలు అందుకునే వీలుంటుందని చెప్పొచ్చు.